



కొండంత శోకం

అంతులేని వేదన, మిన్నంటిన రోదన

కేజీహెచ్‌కు సింహగిరి ఘటన మృతదేహాలు

విగతజీవులైన తమ వారిని చూసి కన్నీరుమున్నీరైన కుటుంబీకులు

- స్వామీ ఇది నీకు తగునా అంటూ విలపించిన మహేశ్ తల్లి శాంతి
- భార్య, కుమార్తె, సోదరిని కోల్పోయి తీవ్ర విషాదంలో పైలా కనకారావు
- ఓదార్చిన ప్రజాప్రతినిధులు

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'బాబూ, బుజ్జీ మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా... నాకు ఏ బాధొచ్చినా అమ్మా అంటూ పక్కనే ఉండేవాడివి. ఇప్పుడు నన్ను ఎవరు చూస్తారు నాన్నా. నేనేందుకు బతకాలి రా. ఆ దేవుడు నన్నైనా తీసుకు పోయాడు కాదే'...అంటూ గుండెలు అవిసేలా రోదించారు గోడ కూలిన ఘటనలో మృతిచెందిన పిల్లా మహేశ్ తల్లి శాంతి. ఈ ప్రమాదంలో శాంతి కుమారుడు, కోడలితోపాటు వియ్యపురాలు, కోడలి మేనత్త ప్రాణాలు కోల్పోయారు. గోడ కూలిన ఘట నలో మొత్తం ఏడుగురు మృతిచెందగా, అందులో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడానికి కేజీహెచ్ మార్చురీకి తీసుకు వచ్చారు. మృతుల కుటుంబ సభ్యులు భారీగా తరలివచ్చారు. విగతజీవులుగా మారిన తమ వారిని చూసి కన్నీరుమున్నీరైన తీరు అక్కడ ఉన్న వారి హృదయాలను ద్రవింపజేసింది. మృతిచెందిన వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భోరున విలపించారు. బాధిత కుటుంబ సభ్యులను మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఓదార్చేందుకు ప్రయత్నించారు.



సింహగిరిపై క్యూలైన్ వద్ద గోడ కూలిన ప్రాంతం.

- మరిన్ని ఫొటోలు 8లో

నా బిడ్డకు దైవ భక్తి మెండు



'నా బిడ్డకు దైవభక్తి ఎక్కువ. తరచూ ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుంటుంటాడు. ఇప్పుడు ఆ భక్తే అతడిని మా నుంచి దూరం చేసింది' అంటూ పత్తి దుర్గా స్వామినాయుడు తండ్రి వీర వెంకట సత్యనారాయణ విలపించారు. కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరంలో ఉంటున్న ఆయన కుమారుడు మృతి విషయాన్ని తెలుసుకుని మధ్యాహ్నంకల్లా కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న మంత్రులు నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, ఇతర నేతలు ఆయనను ఓదార్చారు.

- పత్తి వీర వెంకట సత్యనారాయణ (దుర్గాస్వామినాయుడు తండ్రి)

కొడుకు, కోడలు వెళ్లిపోయారు... ఎవరి కోసం బతకాలి



'నా బిడ్డను నా నుంచి దూరం చేసిన దేవుడికి దయ లేదు. స్వార్థం చూసుకుని గోడలు కట్టి నా బిడ్డను నాకు కాకుండా చేశారు. బంగారం లాంటి కొడుకు, కోడలు వెళ్లిపోయారు. వాళ్లను ఎవరు తెచ్చిస్తారు. ఇక నేను ఎవరి కోసం బతకాలి. బాబూ మహేషా ఎక్కడున్నావయ్యా. నా మంచిచెడుల గురించి ఆలోచించేవాడివి. ఇప్పుడు నాకు ఎవరున్నారయ్యా. శైలూ నన్ను వదిలి పెట్టి వెళ్లిపోయావా.. కూతుర్ని అంటివి కదమ్మా...నేను వెళ్లిపోయినా బాగుండేది. దేవుడు ఇలా ఎందుకు చేశాడో' అంటూ పిల్లా మహేశ్ తల్లి శాంతి కన్నీరుమున్నీరు అయ్యారు. కొడుకు, కోడలి మృతదేహాలకు పోస్టుమార్టం చేయొద్దని, తన బిడ్డను చూపించాలని అక్కడకు వచ్చిన హోంమంత్రి అనితతోపాటు ఇతర ప్రజాప్రతినిధులను ఆమె వేడుకున్న తీరు గుండెలను బరువెక్కించింది. - పిల్లా శాంతి, మహేశ్ తల్లి

బాబూ ఎక్కడికి వెళ్లిపోయావురా



సింహాచలం ఘటనలో మృతి చెందిన యడ్ల వెంకటరావు కుటుంబ సభ్యులు మార్చురీ వద్ద భోరున విలపించారు. వెంకటరావు తల్లి యర్రయ్యమ్మ కుమారుడిని పదేపదే తల్చుకుంటూ బాబూ ఎక్కడికి వెళ్లిపోయావురా అంటూ భోరున విలపించారు. ఇక నాకు దిక్కెవరు రా బిడ్డ అంటూ కన్నీరు మున్నీరయ్యారు. భర్త చనిపోయిన విషయాన్ని తట్టుకోలేక భార్య రామలక్ష్మి, నాన్న ఎక్కడ అంటూ పిల్లలు ప్రవీణ్, పృథ్వీ భోరున విలపించారు. బంధువులు కన్నీళ్లపెట్టుకుంటూ వారిని ఓదారుస్తున్నారు.

-యడ్ల యర్రయ్యమ్మ, వెంకటరావు తల్లి

ముగ్గురిని కోల్పోయి.. తీవ్ర విషాదంలో కనకారావు



సింహాచలం ఘటనలో ముగ్గురిని (కుమార్తె శైలజ, భార్య పైలా వెంకటరత్నం, సోదరి గుజ్జరి మహాలక్ష్మి) కోల్పోయిన పైలా కనకారావు షాక్‌లోకి వెళ్లిపోయారు. మార్చురీ వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయన కన్నీరు,మున్నీరుగా విలపించారు. తనకు ఇంకెవరు దిక్కు అంటూ బంధువులు, కుటుంబ సభ్యులతో చెప్పుకుంటూ కుమిలిపోయారు. గుజ్జరి మహాలక్ష్మి కుమారుడు గురుప్రసాదరావు తల్లిని కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోయారు. భోరున విలపిస్తున్న అతనిని కుటుంబ సభ్యులు, బంధువులు ఓదార్చారు.

కుటుంబమంటే తమ్ముడికి ఎంతో ఇష్టం



కుటుంబమంటే తమ్ముడికి ఎంతో ఇష్టమని, నాన్నకు చేదోడు వాదోడుగా ఉండేవాడని ప్రమాదంలో మృతిచెందిన ఈశ్వర శేషారావు సోదరుడు ఆది లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం నుంచి కేజీహెచ్ మార్చురీ వద్దకు చేరుకున్న ఆయన తమ్ముడి మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. మమ్మల్ని విడిచి ఎలా వెళ్లిపోయావు రా తమ్ముడూ అంటూ కన్నీరు మున్నీరయ్యారు. శేషారావు ఇక లేడంటే అమ్మ, నాన్న నమ్మలేకపోతున్నారని వాపోయాడు. - శేషారావు సోదరుడు లక్ష్మీనారాయణ



సింహగిరిపై కూలిన గోడ

దైవ దర్శనానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు...

చందనోత్సవంలో ఊహించని ప్రమాదం

- గోడ కూలి ఏడుగురు మృతి చెందడంతో నగరవాసుల దిగ్భ్రాంతి
- విచారణకు త్రిసభ్య కమిటీని నియమించిన ప్రభుత్వం
- 72 గంటల్లో నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎంతో భక్తితో వచ్చిన 'వారు' ఊహించని ప్రమాదంలో ఊపిరి అందక అశువులు బాశారు. సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం చేసుకోవాలనే కోర్కె తీరకుండానే తనువు చాలించారు. సింహగిరిపై చందనోత్సవం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున జరిగిన దుర్ఘటన నగరవాసులను తీవ్రంగా కలచివేసింది.

ఆకస్మికంగా దట్టమైన మేఘాలు కమ్ముకొని వరుణుడు గర్జిస్తే... స్వామి కరుణించాడని భావించారు. ఆ శీతల పవనాలను పూర్తిగా ఆస్వాదించక ముందే మీద పడిన గోడ ఉక్కిరిబిక్కిరి చేసి ఏడుగురి ప్రాణాలను బలి తీసుకుంది. వారిలో నలుగురు పురుషులు కాగా ముగ్గురు మహిళలు. ఏడుగురిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందినవారు. సింహగిరిపై ఏనాడూ ఇలాంటి ఘటన జరగలేదు. చిన్న చిన్న తోపులాటలు తప్పితే ఇలాంటి ప్రమాదం జరగడం ఇదే తొలిసారి. దాంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇలాంటి ఘటనలు మరెక్కడా జరగకూడదని భావించి, తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన ఆలయాల్లో కట్టడాల పటిష్ఠతపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. సింహగిరి ఘటనపై త్రిసభ్య కమిటీని వేసి 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని కోరింది. ప్రమాదానికి దారితీసిన కారణాలు, బాధ్యులు, దానితో ముడిపడిన ఇతర అంశాలన్నింటిని నివేదించాలని సూచించింది.







శిథిలాల కింద మృతదేహాలు

తొలిసారి చందనోత్సవానికి వెళ్లినవారు ఐదుగురు...

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై బుధవారం తెల్లవారు జామున గోడ కూలిన ఘటనలో మధురవాడ చంద్రంపాలేనికి చెందిన పిల్లా మహేశ్ (30), ఆయన భార్య శైలజ (27), శైలజ తల్లి పైలా వెంకటరత్నం (45), ఆమె మేనత్త గుజ్జారి మహాలక్ష్మి (65), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు (29), పతి దుర్గాప్రసాద్ నాయుడు (30), అడవివరానికి చెందిన ఎడ్ల వెంకటరావు మృతిచెందారు. వీరిలో ఐదుగురు తొలిసారి అప్పన్న నిజరూపం దర్శనం చేసుకునేందుకు వెళ్లినట్టు చెబుతున్నారు. యడ్ల వెంకటరావు, మహాలక్ష్మి గతంలో చందనోత్సవానికి వెళ్లారు. మిగిలినవారు మాత్రం మొదటిసారి చందనోత్సవానికి వెళ్లినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.


అంబులెన్స్‌ల సైరన్లతో హోరెత్తిన సింహగిరి

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చందనోత్సవ సమయాన వరాహ లక్ష్మీనృసింహస్వామి నామస్మరణతో మారుమోగాల్సిన సింహగిరి బుధవారం తెల్లవారుజామున అంబులెన్స్‌ల సైరన్లతో హోరెత్తిపోయింది. రూ.300 క్యూలో భక్తులపై గోడ కూలిపోవడంతో దాని కింద చాలామంది చిక్కుకుపోయారు. ఉదయం సుమారు మూడు గంటల సమయాన ఈ దుర్ఘటన జరగ్గా.. ... మిగతా 6వ పేజీలో

కమనీయం... అప్పన్న నిజరూపం

దర్శించి తరించిన భక్తజనం

- వైభవంగా చందనోత్సవం
- సింహగిరికి పోటెత్తిన భక్తులు



తొలి పావంచా వద్ద అప్పన్న విగ్రహం

సింహాచలం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): **ఏడాదికోసారి నిర్వహించే సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి నిజరూప దర్శనం (చందనోత్సవం) బుధవారం వైభవంగా జరిగింది. లక్షకుపైగా తరలివచ్చిన భక్తుల జయజయధ్వానాల మధ్య అప్పన్నకు పైపూతగా సమర్పించిన చందన విసర్జన కార్యక్రమాన్ని మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత అర్చకులు ప్రారంభించారు.**

మూలవిరాట్‌పై ఉన్న 12 మణుగుల (500 కిలోలు) సిరి చందనాన్ని నోటికి గుడ్డలు కట్టుకుని రజిత బొరిగెలతో ఒలిచి, స్వామిని నిజరూపంలోకి తీసుకువచ్చారు. అనంతరం స్వామి శిరస్సు గుండెలపై రెండు చందనపు ... మిగతా 6వ పేజీలో





అప్పన్న నిజరూప దర్శనం కోసం బారులుతీరిన భక్తులు. (ఇన్‌సెట్‌లో) సింహాద్రప్పన్నకు పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు. చిత్రంలో హోం మంత్రి అనిత ఉన్నారు.

- మరిన్ని ఫొటోలు 8లో

అడుగడుగునా సమన్వయలోపం



ఫుట్‌బోర్డుపై ప్రయాణం వద్దని వారిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

- చందనోత్సవం నిర్వహణలో అధికారులు వైఫల్యం
- దర్శనం చేసుకోకుండానే వెనుతిరిగిన పలువురు భక్తులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం చందనోత్సవంలో ఈసారి కూడా భక్తులు ఇబ్బందిపడ్డారు. బస్సులు అందుబాటులో లేక కాలినడకకే కిందికి దిగి వెళ్లారు. ఉత్సవ నిర్వహణలో ఏటా అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. ఈసారీ అదే జరిగింది. వివిధ శాఖల మధ్య సమన్వయం కొరవడింది. గత ఏడాది ఎన్నికల కారణంగా ప్రొటోకాల్ లేకపోవడంతో అధికారులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అంతేకాకుండా అంతకు ముందు ఏడాది చేదు అనుభవాలతో కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. కొండపైకి ప్రైవేటు వాహనాల సంఖ్య తగ్గించారు. బస్టాండులో రోప్ పార్టీలను పెట్టి వచ్చిన భక్తులను వచ్చినట్టుగా బస్సుల్లో ఎక్కించి కిందికి పంపించారు. ఎవరినీ బస్సు కోసం ఐదు నిమిషాలు కూడా వేచి ఉంచలేదు. దాంతో ఉత్సవం విజయవంతమైంది. ఈ ఏడాది కూడా ప్రైవేటు వాహనాలను అనుమతించడం లేదని, వీవీఐపీలకు కూడా కొండ కింది నుంచి ఏసీ బస్సులు, ఇన్నోవా కార్లు పెట్టామని ప్రకటించారు. పోలీసు బందోబస్తు కూడా భారీగా ఏర్పాటుచేశారు. అయితే ప్రతి ఒక్కరూ ప్రకటనలకే పరిమితమై, విధి నిర్వహణలో చిత్తశుద్ధి చూపించలేదు. ఊహించని విధంగా గోడ కూలి ఏడుగురు మరణించడంతో అధికారులు బెంబేలెత్తిపోయారు. పైకి వచ్చే వాహనాలను ... మిగతా 6వ పేజీలో

అటు విషాదం

ఇటు భక్తిభావం

మది నిండా భక్తిభావంతో అప్పన్న నామ స్మరణ చేస్తూ క్యూలో ముందుకు కదులుతున్న భక్తులు ఒకవైపు... హాహాకారాలు, రోదనలతో నిండిన ప్రాంతం మరోవైపు... సింహగిరిపై మంగళవారం అర్ధరాత్రి గోడ కూలిన సంఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందగా, 15 మంది వరకూ గాయపడ్డారు. ఈ ఘటనతో కొండపై ఒకచోట భక్తిభావం, మరోవైపు తీవ్రమైన విషాదం నెలకొన్నాయి.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

గోడ కూలిన ఘటన దురదృష్టం

మధురవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గోడ కూలిన ఘటనలో ఏడుగురు మృతి చెందడం దురదృష్టకరమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ విచారం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన చంద్రంపాలెంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ మృతదేహాల వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. అనంతరం ఉమామహేశ్వరరావు పాడెను చంద్రంపాలెం శ్మశానవాటిక వరకు మోసి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



పాడె మోస్తున్న గంటా రవితేజ

రవాణా సదుపాయం లేక అవస్థలు

సింహాచలం : చందనోత్సవంలో భాగంగా సహస్ర ఘటాభిషేకంలో పాల్గొన్న శ్రీవైష్ణవ స్వాములకు రవాణా సౌకర్యం కల్పించడంలో దేవాలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఏటా చందనోత్సవం నాడు తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది స్వాములు సింహాచలం వస్తుంటారు.దూరం నుంచి వచ్చిన వారికి వసతి కల్పించకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మరోవైపు సింహగిరిపై సాయంత్రం తిరుగు ప్రయాణంలో భక్తులకు సరైన రవాణా సదుపాయం కల్పించలేదు. సింహాచలం డిపో నుంచి ఆర్టీసీ బస్సులు నడిపినా పెద్దగా ఉపయోగం లేకపోయింది. ఇదే అదునుగా ప్రైవేటు వాహనదా రులు బాగా సొమ్ము చేసుకున్నారు.



టోల్‌గేటు వద్ద వైష్ణవస్వాముల నిరీక్షణ

బుధవారం రాత్రి 7 గంటల తరువాత సింహాచలం కూడలి నుంచి గోశాల కూడలి వరకు రూ. 50, సింహాచలం నుంచి గోపాలపట్నం వరకు రూ.300 చొప్పున చార్జీలు వసూలు చేశారు.



మార్కెట్‌లో కూలిపోయిన టెంట్లు

భీమిలిలో ఈదురుగాలుల బీభత్సం

భీమునిపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు గంటస్తంభం వద్ద జీవీఎంసీ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కూరగాయలు, చేపల మార్కెట్‌లో పెండాల్స్, పగోడాలు కుప్పకూలాయి. సాయంత్రం వరకూ కూలిపోయిన పెండాల్స్‌ను జీవీఎంసీ అధికారులు సరిచేయకపోవడంతో వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. అలాగే పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పాత బస్టాండ్‌లో బస్ షెల్టర్ నేమ్‌లో బి అక్షరం పైభాగం ఎగిరిపోయింది.

బోటు షికార్ నిలిపివేత

సాగర్‌నగర్ : రుషికొండ బీచ్‌లో పర్యాటక శాఖ నిర్వహిస్తున్న బోటు షికార్‌ను బుధవారం నిలిపివేశారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడం, కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడుతుండడంతో బోటు షికార్ నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. కాగా రుషికొండ, సాగర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో తీర ప్రాంతాలు చల్లబడ్డాయి. ఇన్నాళ్లు వేసవి తాపంతో ఇబ్బందులు పడిన ప్రజలకు వర్షంతో ఉపశమనం పొందారు. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది.

ఏప్రిల్‌లో రూ.168 కోట్లు ఆస్తిపన్ను వసూలు

గత ఏడాదితో పోల్చితే రూ.36 కోట్లు అధికం

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీకి ఆస్తిపన్ను పన్ను రూపంలో ఏప్రిల్ నెలలో రూ.168 కోట్లు ఆదాయం సమకూరింది. గత ఏడాది ఏప్రిల్ నెలతో పోల్చితే రూ.36 కోట్లు అధికం కావడం విశేషం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నుని ఒకేసారి చెల్లించినవారికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ప్రకటించింది. అలాగే ఇంతవరకూ ఆస్తిపన్ను బకాయి ఉన్న వారు బకాయిలు చెల్లిస్తే వడ్డీపై 50 శాతం మాఫీని ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. ఇది పన్ను వసూలు పెరుగుదలకు దోహదపడిందని జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ)ఎస్. శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. జీవీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సూచనలు మేరకు ఆస్తి పన్ను ఆదాయం మరింత పెంచేందుకు వీలుగా వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించినట్టు చెప్పారు.

ప్రశాంతంగా పాలీసెట్

జిల్లాలో 93.74 శాతం హాజరు

కంచరపాలెం ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం జరిగిన పాలీసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.పరీక్షనకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా పాలీసెట్ కో-ఆర్డినేటర్ డా.కె.నారాయణరావు వెల్లడించారు. జిల్లాలో మూడు డివిజన్లలో భీమునిపట్నం, పెందుర్తి, విశాఖపట్నం నుంచి 13188 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 12363 మంది ప్రవేశ పరీక్షనకు హాజరయ్యారు. పరీక్షకు 825 మంది గైర్హాజరయ్యారు. డివిజన్ల వారీగా చూస్తే.. విశాఖపట్నం డివిజన్‌లో 9405 మందికి 8746 మంది విద్యార్థులు హాజరయ్యారు. పెందుర్తి డివిజన్‌లో 2635 మందికి 2531 మంది, భీమునిపట్నం డివిజన్‌లో 1148 మందికి 1086 మంది విద్యార్థులు హాజరైనట్టు నారాయణరావు తెలిపారు. మొత్తంగా జిల్లాలో 93.74 శాతం పాలీసెట్-2025కు హాజరు శాతం నమోదైంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో జరిగిన పరీక్షకేంద్రాన్ని జిల్లా పాలీసెట్ పరిశీలకులు విజయభాస్కర్ పరిశీలించారు.



హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావుకు జ్ఞాపిక అందజేసి సత్కరిస్తున్న గీతం ప్రో వీసీ గౌతమ్‌రావు, తదితరులు

న్యాయవాదులకు ఆత్మవిశ్వాసం ముఖ్యం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. మన్మథరావు

సాగర్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదులకు వృత్తిపరమైన పరిజ్ఞానంతో ఆత్మ విశ్వాసం ముఖ్యమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. మన్మథరావు అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.న్యాయవాద వృత్తిలో నిరంతర విద్యార్థిగా ఉంటూ నూతన అంశాలు, తీర్పులను అర్థం చేసుకుంటూ ప్రతిభను సానపెట్టుకోవాలని సూచించారు.వాస్తవానికి న్యాయవాద వృత్తిలో ఎదుగుదలకు పీహెచ్‌డీ అవసరం లేకపోయినా తాను బీకాం, బీఎల్ తరువాత ఎంఎల్ చదివి వృత్తిలో కొనసాగుతూనే పీహెచ్‌డీ పూర్తి చేశానని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రణాళిక ఉండాలన్నారు. గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు మాట్లాడుతూ వేల సంఖ్యలో ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించడం, తెలుగులో తీర్పులు ఇవ్వడం ద్వారా జస్టిస్ మన్మథరావు ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. అనంతరం ఆయన హైకోర్టు జడ్జిని సన్మానించారు. కార్యక్రమంలో లా కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న చిన్నశ్రీను

భీమునిపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్, వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) బుధవారం లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. మెట్ల మార్గంలో సౌమ్యగిరిపైకి వెళ్లి స్వామివారికి పూజలు చేశారు. అర్చకుడు రొంపిచర్ల లక్ష్మీనరసింహ ప్రసాదాచార్యులు ఆయన పేరుతో అర్చనలు జరిపారు. ఈ క్యార్యక్రమంలో 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాన్ని దైవంగా భావించాలి

ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

భీమునిపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఉద్యోగాన్ని దైవంగా భావించి, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. బుధవారం బీచ్ రోడ్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమారి పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ధర్మాన్ని 44 ఏళ్లు బాధ్యతగా నిర్వర్తించి, విద్యా రంగానికి సుదీర్ఘ సేవలందించిన జ్యోతికుమారిని అభినందించారు. జోన్ వన్ విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి. విజయభాస్కర్ మాట్లాడుతూ జ్యోతికుమారి విద్యాభివృద్ధికి చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయులు, తదితరులు జ్యోతికుమారి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ, శ్రీకాకుళం డీఈఓలు ప్రేమ్‌కుమార్, చైతన్య, విజయనగరం, భీమిలి డైట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పగడాలమ్మ, సుధాకర్, అధ్యాపకులు, ఆరు జిల్లాల విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు పాల్గొన్నారు.



జ్యోతికుమారి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం

» మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే గంటా

సింహాచలం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై ఏడుగురు మృతికి కారణమైన దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, బాధ్యులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీని వాసరావు అన్నారు. విజయనగరం ఎంపీ అప్పలనాయుడుతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఘటనపై విచారణ జరిపించి, బాధ్యులను చట్టపరంగా శిక్షిస్తామన్నారు.

25 మొక్కలు వితరణ

ఆనందపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నగరంలోని పాండురంగాపురం లయన్స్ క్లబ్ సభ్యులు 25 మొక్కలను బుధవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కేఆర్‌కే పట్నాయక్ మాట్లాడుతూ ఆనందపురం స్కూల్ పీఎం శ్రీ పథకానికి ఎంపిక కావడం తో క్రీడా మైదానంతో పాటు కిచెన్ గార్డెన్‌కు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. క్రీడా మైదానంలో మొక్కలను నాటి సుందరంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మంత్రి విజయలక్ష్మి, మాజీ ప్రెసిడెంట్ కంటి మహంతి వరలక్ష్మి, వడ్డే పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

భీమునిపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బాలలకు చదువుతో పాటు సృజనాత్మక అంశాలను కూడా నేర్పించాల్సిన అవసరం ఉందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాజ్జీరావు అన్నారు. చిన్నబజారులోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో కళాసాహితి ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో మానసిన వికాసాన్ని కలుగజేస్తాయన్నారు. ప్రవచనకర్త రామకృష్ణానంద, కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ శిక్షణ ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కళా సాహితి అధ్యక్షుడు పీఆర్‌పీ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు పెదబాబు, వెంకటేశ్వరదాసు, కిశోర్, శ్రీను పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో చేపల లారీ బోల్తా

సాగర్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ఎదురుగా ఉన్న మలుపులో బుధవారం చేపల లారీ బోల్తా పడింది. భీమిలి నుంచి నగరంలోకి చేపల లోడుతో వస్తున్న లారీ ఫుట్‌పాత్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదం నుంచి లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

ప్రశాంతంగా పాలీ సెట్

భీమునిపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆరు కేంద్రాల్లో బుధవారం పాలిటెక్నిల్ ప్రవేశపరీక్ష నిర్వహించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియరు కళాశాల, మహిళా పాలిటెక్నిక్ కళాశాల, సీడర్ స్కూల్స్ కాంప్లెక్స్, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈ పరీక్ష జరిగింది. మొత్తం 1144 మంది విద్యార్థులకు గాను 1086 మంది హాజరయ్యారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది.

చంద్రంపాలెం రోడ్డుపై మురుగు నీరు

మధురవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని చంద్రంపాలెం సర్వీసు రోడ్డుపై మురుగు నీరు ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీల్లోని మురుగు పొంగి రోడ్డుపైకి వచ్చింది.స్థానికుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది వెంటనే స్పందించి మురుగు నీరు పోయే మార్గాలు ఏర్పాటు చేశారు. కాలువల్లో పూడికలు తీయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు చెబుతున్నారు.

కిశోర వికాసంపై ఉద్యోగులకు శిక్షణ

పద్మనాభం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెలుగు కార్యాలయంలో భీమిలి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై గ్రామస్థాయి ఉద్యోగులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం సాయి రమేశ్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలపై కిశోర బాల, బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, బాలల చట్టాలు, పునరుత్పత్తి ఆరోగ్యం, లింగ వివక్ష, శారీరక ఆరోగ్యంపై వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, అనిత, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల సైరన్లతో హోరెత్తిన సింహగిరి

... 5వ పేజీ తరువాయి

అధికారులు వెంటనే అంబులెన్స్‌లను రప్పించారు. శిథిలాల కింద ఎక్కువ మంది ఉన్నారని గుర్తించడంతో కొండ దిగువ నుంచి మరికొన్ని అంబులెన్స్‌లు తెప్పించారు. మొత్తం 14 అంబులెన్స్‌లను మృతదేహాలను, గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించడానికి ఉపయోగించారు. ట్రాఫిక్‌లో వీటికి లైన్ క్లియర్ చేయడానికి కొండ దిగువన కొద్దిసేపు బస్సులను నిలిపివేశారు. వీవీఐపీ వాహనాలు తప్ప ఇంకేమీ రాకుండా పోలీసు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ బాధితుల తరలింపును దగ్గరుండి పర్యవేక్షించారు.

అడుగడుగునా సమన్వయలోపం

... 5వ పేజీ తరువాయి

తగ్గించేశారు. కిందనే ఆపేశారు. అయితే ఆ ఘటనతో సంబంధం లేకుండా భక్తులు, వీఐపీలు దర్శనాల కోసం వస్తూనే ఉన్నారు. భక్తులు వేల సంఖ్యలో వస్తుంటే బస్సులు ఒకటి, రెండు రావడంతో తోపులాటలు జరిగాయి. వీవీఐపీలు కొండ దిగువనే ఏసీ బస్సుల కోసం వేచి చూసి చూసీ పైకి వెళ్లే అవకాశం లేకపోవడంతో చాలామంది దర్శనం చేసుకోకుండానే వెనక్కి తిరిగి వెళ్లిపోయారు. ప్రైవేటు వాహనాలు అనుమతించక, ప్రత్యేక వాహనాలు లేక ఎలా అంటూ భక్తులు శాపనార్థాలు పెట్టారు.

క్యూలైన్ల వద్ద కనిపించని స్కానింగ్

ప్రతిసారి క్యూలైన్ల వద్ద తోపులాటలు జరుగుతాయి. అక్కడే జెరాక్స్ కాపీ టిక్కెట్లు తెచ్చి క్యూలైన్‌లో దూరే ప్రయత్నం చేస్తారు. పోలీసులు టిక్కెట్లు లేని తమవారిని అక్కడే లోపలకు పంపిస్తారు. గత ఏడాది ప్రతి ఒక్కరి టిక్కెట్ తీసుకొని స్కానింగ్ చేసి, ఆ తరువాత మరో గేటు వద్ద దానిని పరిశీలించి పంపించారు. ఈ సారీ అలాగే చేస్తామని ప్రకటించారు. కానీ ఆచరించలేదు. ఆలయ గోపురం ముందు ఏర్పాటుచేసిన రూ.వేయి, రూ.1,500 క్యూలైన్ల వద్ద తోపులాటలు జరిగాయి. వీటిని పరిమిత సంఖ్యలో ఇచ్చామని అధికారులు చెప్పగా, వందల సంఖ్యలో ఒకేసారి వచ్చి మీద పడిపోయారు. అక్కడే పోలీసు ఉన్నతాధికారులు ఉన్నా పెద్దగా పట్టనట్టు ఊరుకున్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పరిస్థితిని గమనించి, అక్కడికి వెళ్లి దేవదాయ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. అక్కడే ఉండి ఒకరి తరువాత మరొకరు రావాలని సూచించారు. అయినా పరిస్థితి అదుపులోకి రాలేదు. క్యూలైన్లను సరిగ్గా నడపాల్సిన పోలీసులు ఆ విధులు వదిలి ఇంకెక్కడో ఉండడంతో పర్యవేక్షించే దిక్కు లేకుండా పోయింది. దీనివల్ల టిక్కెట్లను స్కానింగ్ చేయలేదు. అది రూ.300 టిక్కెటా? వేయి రూపాయల టిక్కెటా? అని చూడకుండానే చింపేసి లోపలకు వదిలేశారు. ఇక్కడి నుంచే ఎక్కువ మంది అనధికారికంగా లోపలకు వెళ్లారు. ఒకసారి క్యూలైన్‌లోకి వెళితే ఆ తరువాత మళ్లీ చెక్ చేసే ఏర్పాట్లు చేయకపోవడంతో చాలామంది నేరుగా లోపలకు వెళ్లిపోయారు.

బస్సుల వెంట సీపీ పరుగులు

కొండపైన బస్టాండులో వేలాది జనం, ఒకటి అరా బస్సులు వస్తుండడంతో సీట్ల కోసం భక్తులు పరుగులు పెట్టారు. వేలాడుతూ కిందికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఆ పరిస్థితిని గమనించిన పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వారిని నివారించే ప్రయత్నం చేశారు. బస్సులు వస్తాయని, కాసేపు ఆగి వెళ్లాలని, బస్సుల వెంట పరుగులు తీయొద్దని సూచించారు. ఫుట్‌రెస్ట్‌పై వేలాడుతున్న వారిని కిందికి దించే ప్రయత్నం చేశారు. కళ్ల ముందు వైఫల్యం కనపడుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు.

ప్రకృతి వ్యవసాయానికి 4 గ్రామాలు ఎంపిక

పద్మనాభం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో నాలుగు గ్రామాలను ప్రకృతి వ్యవసాయానికి ఎంపిక చేసినట్టు అధికారులు తెలిపారు. కృష్ణాపురం, విలాస్‌ఖాన్‌పాలెం, బీఆర్ తాళ్లవలస, రేవిడి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంలో రైతులు వరి పండించే విధంగా ప్రోత్సహించనున్నారు. ఇప్పటికే కొవ్వాడ, అనంతవరం, పెంట, గంధవరం, పొట్నూరు, రెడ్డిపల్లి, మద్ది, అయినాడ, కోరాడ, పాండ్రంగి, బాందేవుపురం గ్రామాల్లో ప్రకృతి సేద్యం అమలవుతోంది.

ఘనంగా అష్టలక్ష్మీ దేవాలయం వార్షికోత్సవం

కొమ్మాది, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) :అన్నంరాజునగర్‌లో ఉన్న అష్టలక్ష్మీ దేవాలయం వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి ఆధ్వర్యంలో వేకువజామున సుప్రభాత సేవ అనంతరం తోమాల సేవ నిర్వహించి, ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. మండలారాధనలు, హోమాలు జరిపారు. సాయంత్రం లక్ష్మీనారాయణుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణుల ఉత్సవ విగ్రహాలు

కమనీయం...అప్పన్న నిజరూపం

... 5వ పేజీ తరువాయి

ముద్దలను ఉంచారు. షోడశోపచార పూజలు చేసిన తరువాత ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పించారు. తెల్లవారుజామున 2.45 గంటల నుంచి సాధారణ భక్తులను దర్శనానికి అనుమతించారు.

తరలివచ్చిన భక్తులు

స్వామిని నిజరూపంలో దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో అర్ధరాత్రి నుంచే క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ప్రముఖులకు ఉదయం ఆరు గంటల వరకు మాత్రమే అంతరాలయ దర్శనాలు కల్పించిన అధికారులు అనంతరం నీలాద్రిగుమ్మం వద్ద గేటుకు తాళాలు వేశారు. ఇదిలావుండగా తెల్లవారుజామున జోడుభద్రాల వద్ద రూ.300 క్యూ సమీపంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందడంతో సర్వత్రా ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో భక్తుల రాక తగ్గింది. ఆ తరువాత క్రమేపీ రద్దీ పెరుగుతూ ఉదయం పదిన్నర గంటల సమయానికి నిర్దేశించిన క్యూలను దాటి సుమారు 1.5 కిలోమీటర్ల పొడవున ఘాట్‌రోడ్డుపైకి చేరింది. తెల్లవారుజామున భారీవర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో మరింతమంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆ తరువాత వర్షం కురిసినప్పటికీ భక్తుల తాకిడి తగ్గలేదు. పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు సింహాద్రినాథుని నిజరూప దర్శనం చేసుకున్నారు.

సంప్రదాయబద్ధంగా సహస్ర ఘటాభిషేకం

ఆలయ ఆచారం ప్రకారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయరు స్వామి పర్యవేక్షణలో సుమారు నాలుగు వందల మంది శ్రీవైష్ణవులు అంతరాలయంలో స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆ తరువాత తొలివిడత చందన సమర్పణ గావించి, శీతలోపచారాలు సమర్పించి కర్పూర నీరాజనాలిచ్చారు. అప్పన్నను నిత్యారూపంలోకి తీసుకురావడంతో చందనోత్సవం పరిసమాప్త మయింది.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

» సింహగిరిపై గోడ కూలి మృతి చెందిన వారి కుటుంబాలకు వీఎంఆర్డీఏ చైర్మన్, ఎమ్మెల్యే వెలగపూడి, మాజీ మంత్రి అమర్‌నాథ్ పరామర్శ



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం లక్ష్మీ నృసింహ స్వామి దివ్య దర్శనానికి వెళ్లి, దర్శనం చేసుకోకపోవడమే కాకుండా విగత జీవులే ఇంటికి తిరిగి రావడం ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. పాత వెంకోజపాలేనికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడడంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. అప్పటి వరకు నిశ్శబ్దంగా ఉన్న 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నుముట్టాయి. సింహాచలం లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనానికి వెళ్లిన పైలా వెంకటరత్నం(45) స్వామివారి దర్శనం చేసుకోక ముందే ప్రమాదవశాత్తు క్యూలైన్లులోని గోడ కూలి మృతి చెందింది. అంతేకాకుండా ఆమెతో పాటు ఆడపడుచు గుజ్జరి మహాలక్ష్మి(65), కూతురు పిల్లా శైలజా (29), అల్లుడు పిల్లా ఉమామహేశ్వరరావు (30)లు కూడా అదే ఘటనలో ప్రాణాలను కోల్పోవడంతో ఆ కుటుంబమే కాకుండా పాత వెంకోజీపాలెం ప్రాంతమంతా కూడా ఒక్కసారి శోకసముద్రంలో మునిగిపోయింది. మొదటి సారి సింహాచలం నృసింహస్వామి నిజరూప దర్శనానికి వెళ్లి తిరిగి రానిలోకాలకు వెళ్లిపోవడం కలచి వేసింది. ఒకేసారి కుటుంబంలో నలుగురి మరణం చోటుచేసుకోవడంతో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతుల కుటుంబాలు తెలిపిన వివరాలి ఉన్నాయి. మృతురాలు వెంకటరత్నం ఎంతో కాలంగా పాత వెంకోజీపాలెం ఉమానగర్‌లో సొంతింటిని ఏర్పాటు చేసుకుని తమ కుటుంబంతో జీవిస్తున్నారు. భర్త పైలా కనకరావు ప్లంబింగ్ వర్క్ చేస్తుంటారు. ఈమెకు ఒక కొడుకు, ఒక కూతురు. కొడుడు సాఫ్ట్‌వేర్ బెంగళూరులో చేస్తున్నారు. కూతురు మృతురాలు శైలజ, అల్లుడు మృతుడు ఉమామహేశ్వరరావులకు మూడేళ్ల క్రితమే పెళ్లి అయింది. ఇంకా పిల్లలు లేరు. వీరిదరూ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అలాగే మృతురాలు మహాలక్ష్మి భర్త చనిపోయి చాలా కాలం అయింది. ఈమెకు ఇద్దరు కొడుకులు. వీరిద్దరికీ పెళ్లిలు అయిపోయాయి. మహాలక్ష్మి ఇద్దరి కొడుకులు, కోడళ్లు, మనుమళ్లతో ఒకే ఇంటి వద్ద కింద, పైన పోర్షన్‌లలో ఉంటున్నారు.

మృతుల కుటుంబాలకు రాజకీయ నేతల పరామర్శ

మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ ఛైర్‌పర్సన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ భరోసా ఇచ్చారు. భగవంతుడి దర్శనానికి వెళ్లి విగత జీవులు కావడం చాలా బాధాకరమన్నారు. తొలుత మృతులను కేజీహెచ్ మార్చురీ వద్ద రాష్ట్ర మంత్రులతో కలిసి చూసిన అనంతరం దగ్గరుండి పోస్టుమార్టం కార్యక్రమాలను నిర్వహింపజేసి, అనంతరం పాతవెంకోజీపాలెంకు చెందిన మృతురాలు వెంకటరత్నం, మహాలక్ష్మిల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎమ్మెల్యే, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ మృతుల దహన సంస్కారాలు జరిగే వరకూ కుటుంబ సభ్యుల వెంట ఉన్నారు. దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, లీగల్ సెల్ సభ్యులు అప్పారి గిరిబాబులు వెంటనే మృతుల కుటుంబ సభ్యులను కలిసి వివరాలను అడిగి తెలుసుకుని, దహన సంస్కారాలకు కావాల్సిన ఏర్పాట్లను చూశారు. దీనిలో టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, బుగత సత్యనారాయణ, నారు గోపి, సిహెచ్.గోవింద్, మళ్ల వెంకటి, సోని, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి : వైసీపీ నేతలు

మృతుల కుటుంబాలను పరామర్శించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు గుడివాడ అమర్‌నాథ్, తైనాల విజయకుమార్, వైసీపీ నగర అధ్యక్షుడు కె.కె.రాజు, తూర్పు నియోజకవర్గం పరిశీలకుడు మొల్లి అప్పారావు ఇతర నాయకులు మాట్లాడుతూ ప్రాణాలను కోల్పోయిన మృతుల కుటుంబాలకు కంటి తుడుపు చర్యగా కాకుండా పూర్తి స్థాయిలో న్యాయం చేయాలన్నారు. మృతులు వెంకటరట్నం, మహాలక్ష్మి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైభవంగా నీలధార కార్యక్రమం



శ్రీకనకమహాలక్ష్మి (దుర్గ) అమ్మవారికి నీలధారణ చేస్తున్న భక్తులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చినవాల్తేరు గ్రామ దేవత శ్రీకనక మహాలక్ష్మి (దుర్గ) అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా చినవాల్తేరు యాదవ్ స్టార్స్ ఆధ్వర్యంలో బుధవారం నీలదారణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గుంటుబోయిన వెంకట అప్పారావు గోవిందమ్మ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తనయుడు ప్రతాప్‌రుద్ర పాల్గొని ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చినవాల్తేరు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొన్నారు. మహిళా భక్తులు బిందెలతో నీటిని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకాలుచేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో 21వ వార్డు అధ్యక్షుడు పీతల అ మరేంద్ర, పీతల అవినాష్ యాదవ్, నాయుకులు గుంటుబోయిన మూర్తి యాదవ్, నక్క వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేయనున్న జీవీఎంసీ ఉద్యోగులకు సన్మానం



పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను సన్మానించిన ఏడీసీ రమణమూర్తి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అని, శేష జీవితం ఆనందంగా గడపపాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ బీవీ రమణమూర్తి పేర్కొన్నారు. జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఏడుగురు ఉద్యోగులను అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, డీపీవో ఫణిరామ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మజతో కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీసీ రమణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారు జీవీఎంసీ సుదీర్ఘకాలం ప్రజల కొరకు ఎన్నో సేవలు అందించారని, రోజులో తన కుటుంబం కంటే తమ సంస్థ కోసం అంకితమై సేవలు అందించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఉద్యోగి తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి జీవీఎంసీ ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్లపై, కార్యాలయాల్లో పనిచేసి ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారని, అటువంటి ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందినప్పుడు వారిని జీవీఎంసీ గౌరవించడం మంచి సంప్రదాయం అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రూ.65,47,310లు ప్రావిడెంట్ ను అందించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూ ఈఎంఎస్, జేమ్స్ జనరల్ సెక్రటరీ ఏ.అప్పలరాజు, ఇతర అధికారులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

» వామపక్ష నేతల డిమాండ్

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. కేజీహెచ్ మార్చురీలోని మృతదేహాలను పరిశీలించిన అనంతరం వారు వేర్వేరు సందర్భాల్లో మృతుల కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం వీరు మీడియాతో మాట్లాడుతూ సింహాచలం ఘటనకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారంతో పాటు కుటుంబసభ్యుల్లో ఒకరికి శాశ్వత ఉపాధి కల్పించాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఒకే కుటుంబంలో నలుగురు మరణించడం బాధాకరమన్నారు. ఇటీవలే నిర్మించిన గోడ నాణ్యత అత్యంత లోపభూయిష్టంగా ఉందని, చిన్నపాటి వర్షానికే గోడ కూలిపోవడం పరిస్థితికి నిదర్శనమన్నారు. తక్షణం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఓపెన్ పరీక్షలో హోం విద్యార్థినుల ఉత్తీర్ణత

ఆరిలోవ ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : విశాఖవేలీ స్కూలు సమీంపలో గల బాలికల ప్రత్యేక హోమ్‌లో ఓపెన్ ఇంటర్ పరీక్షల్లోముగ్గురు విద్యార్థినులు, ఓపేన్ టెన్‌లో ఒక విద్యార్థిని ఉత్తీర్ణతసాధించినట్లు హోం సూపరింటెండెంట్ కె.సునీత తెలిపారు. టెన్త్‌లో ఐదుగురు విద్యార్థి నులు పరీక్షలు రాయగా ఒకరు, ఇంటర్‌లో నలుగురు విద్యార్థినులు పరీక్షలు రాయగా ముగ్గురు ఉత్తీర్ణత సాధించినట్లు అమె తెలిపారు.

జోనల్ ఎన్ఎస్ఎస్ అధికారిగా ఉమామహేశ్వరరావు



మద్దిలపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృతం అధ్యాపకులు, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) అధికారిగా వ్యవహరిస్తున్న పోల ఉమామహేశ్వరరావు జోనల్ ఎన్ఎస్ఎస్ అధికారిగా నియమితులయ్యారు. ఈయన విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామా రాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు జాతీయ సేవా పథకం కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. గతంలో యూనివర్సిటీ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ జాతీయ సేవాపథకం అధికారిగా ఉమామహేశ్వరరావు అవార్డులు పొందారు. జాతీయ స్థాయి సేవా కార్యక్రమాలు, ఇంటిగ్రేషన్ క్యాంపుల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ జయ, సిబ్బంది తదితరులు ఉమామహేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

గోడ కూలి ఏడుగురు మృతి చెందడం బాధాకరం : వీఎంఆర్‌డీఏ ప్రణవ్ గోపాల్

సిరిపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీవరహా లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అలయం వద్ద ప్రమాదం జరగడం బాధాకరమని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ అన్నారు. భారీ వర్షానికి గోడకూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, కొంతమందికి గాయాలు కావడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ దుర్ఘటన ఎంతో బాధ కలిగించిందన్నారు.

జంట హత్యల కేసు కొలిక్కి!

ఆ దంపతులతో సన్నిహితంగా ఉంటున్న వ్యక్తే హంతకుడు?

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజోతి): దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి రాజీవ్ నగర్‌లో జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసు ఒక కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. హత్యకు గురైన గంపల యోగీంద్రబాబు (66), లక్ష్మి (52)లతో బాగా సన్నిహితంగా ఉండే వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు సమాచారం. మిస్టరీగా మారిన ఈ కేసును ఎట్టకేలకు పోలీసులు చేధించినట్టు తెలియవచ్చింది. రిటైర్డు నేవల్ ఉద్యోగి అయిన యోగీంద్రబాబుకు, స్థానిక గ్లోరియో స్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న లక్ష్మికి ఎవరితో విభేదాలు లేవని స్థానికులతో పాటు కుటుంబ సభ్యులు పేర్కొన సంగతి తెలిసిందే. అయితే ఈ దంపతులకు బాగా సుపరిచితుడైన వ్యక్తే హత్యలకు పాల్పడినట్టు తెలుస్తోంది. హతుల ఇంట్లో బంగారం, నగదు మాయం కాకపోవడంతో ఇది దొంగల కాదని, ఆ కుటుంబంతో అత్యంత సన్నిహితంగా ఉండేవారే దారుణానికి పాల్పడి ఉంటారన్న కోణంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేసినట్టు తెలిసింది. సీపీ ఆదేశాల మేరకు పోలీసులు వందలాది మందిని విచారించి హంతకుడి ఆచూకీ కనుగొన్నట్టు తెలియవచ్చింది. జంట హత్యలకు పాల్పడిన వ్యక్తి యోగీంద్రబాబు దంపతులకు చెందిన స్కూటీపై విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడ ఆ వాహనాన్ని పార్కింగ్ చేసి వేరే రాష్ట్రానికి పారిపోయినట్టు సమాచారం. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లో స్కూటీని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. హంతకుడి కోసం పోలీసులు పలు రాష్ట్రాల్లో గాలిస్తున్నట్టు భోగట్టా.

ఉరుములు, ఈదురు గాలులతో వర్షం

ఉక్కపోత నుంచి ఉపశమనం పొందిన నగరవాసులు

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా ఎండ, ఉక్కపోతతో అల్లాడిన నగరవాసులు బుధవారం వేకువజాము నుంచి కురిసిన వర్షంతో సేదదీరారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక నగరంపై మేఘాలు ఆవరించి ఉరుములు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి నగరం, పరిసరాల్లో మేఘాలు దట్టంగా ఆవరించాయి. ఉదయం నుంచి కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. మధ్యాహ్నం నుంచి నగరం, పరిసరాల్లో జోరున వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. సాయంత్రం వరకు మేఘాలు కొనసాగాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు భీమిలిలో 24.75, బుచ్చిరాజుపాలెంలో 24.25, సింహాచలంలో 21.5, గాజువాక కేబీఆర్ పార్కులో 20.25 మి.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు గాజువాక కేబీఆర్ పార్కు వద్ద 32.0, మేహద్రిగెడ్డ వద్ద 30.5, అగనంపూడిలో 29.25, దువ్వాడలో 25.75, షీలానగర్‌లో 22.5 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

గోపాలపట్నం పోలీసులపై హోంమంత్రి అనిత సీరియస్

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై గోడ కూలి మృతి చెందిన వారికి పోస్టుమార్టం నిర్వహించే ప్రక్రియను వేగంగా ప్రారంభించకపోవడం పట్ల హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పోసుమార్టం ప్రక్రియను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ గోపాల పట్నం పోలీసులపై ఆగ్రహం వెలిబుచ్చారు. మీ అందరి సంగతి తేలుస్తానంటూ హెచ్చరించారు. వేగంగా ప్రక్రియ పూర్తి చేయకుండా ఏం చేశారంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

గోడ కూలి గాయపడిన బాధితుడికి విమ్స్‌లో చికిత్స

ఆరిలోవ ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చందనోత్సవ వేళ సింహగిరిపై గోడ కూలి తీవ్ర గాయాల పాలైన స్థానిక బాలాజీనగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌కు విమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. ఈ దుర్ఘటన జరిగిన అనంతరం బుధవారం వేకువజామున ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు అంబులెన్స్‌లో విమ్స్‌కు తీసుకొచ్చారు. ఆయనకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్టు విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు తెలిపారు. గాయపడిన ప్రవీణ్ కుమార్ కుడి కాలు పాదం వద్ద, కుడి పక్కటెముకల వద్ద గాయాలైనట్టు విమ్స్ డైరెక్టర్ వెల్లడించారు. ఈసీజీ స్కానింగ్, ఇతర మెడికల్ రిపోర్టులు వచ్చిన తర్వాత ప్రత్యేక వైద్యం అందిస్తామని తెలిపారు. విమ్స్‌లో చికిత్స పొందతున్న ప్రవీణ్‌కుమర్‌ను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పరామర్శించారు

దోమల నివారణకు 12వ వార్డులో ఫాగింగ్

ఆరిలోవ ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది అన్ని వీదుల్లో బుధవారం ఫాగింగ్ నిర్వహించారు. దీనివల్ల దోమలు బాధ నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని సిబ్బంది చెప్పారు.



ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగను పంపిణీ చేస్తున్న సత్యసాయి భజన మండలి ప్రతినిధులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బాటసారుల దాహార్తిని తీర్చే నిమిత్తం భగవాన్ శ్రీసత్యసాయి భజన మండలి హెచ్‌బీ కాలనీ (సిటీ సమితి) ఆధ్వర్యంలో బుధవారం హెచ్‌బీ కాలనీలో చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. జూన్ 15వ తేదీ వరకు కొనసాగే ఈ చలివేంద్రంలో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేయనున్నట్టు సత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎం.హెచ్.ఎస్.వి.ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో ఎం.ఎస్.ప్రకాష్‌రావు, మళ్ల అప్పలరాజు, ఎం.శ్రీనివాసరావు, డీటీఆర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.24 లక్షల వసూలు

బాధితుడి ఫిర్యాదుతో యువకుడి అరెస్టు

పెందుర్తి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (భెల్)లో ఇంజనీర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ యువకుడిని మోసం రూ.24 లక్షలు వసూలు చేసి ఆ డబ్బును క్రికెట్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్న ప్రబుద్ధుడిని బుధవారం పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పురుషోత్తపురానికి చెందిన జి.రవితేజ (28) బీటెక్ తప్పి ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో పెందుర్తి బీసీ కాలనీలో ఉంటున్న సాగర్‌తో పరిచయమైంది. బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ యత్నాలు చేస్తున్న సాగర్‌కు భెల్‌లో ఉద్యోగం వచ్చేలా చూస్తానని నమ్మబలికి దఫదఫాలుగా రూ.24 లక్షలను రవితేజ వసూలు చేశాడు. అలా వసూలు చేసిన డబ్బుతో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు రవితేజ పాల్పడి మొత్తం పోగొట్టుకున్నాడు. తన ఉద్యోగం గురించి సాగర్ ఎన్నిసార్లు అడిగినా రవితేజ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ తప్పించుకుని తిరుగుతుండడంతో తాను మోసపోయానని భావించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రవితేజను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

భీమిలి ఎమ్మెల్యే గంటాను కలిసిన డీసీఎంఎస్ ఛైర్మన్ బాలాజీ

సిరిపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్‌గా నియమితులైన కోట్ని బాలాజీ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడిన యువతకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేస్తున్నారని గంటా పేర్కొన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బాలాజీని శాలువా కప్పి సన్మానించి అభినందించారు.



బాలాజీని అభినందిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా

సినిమా గైడ్

● హిట్ : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● రెట్రో : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)

● అర్జున్ సన్నాఫ్ వైజయంతి : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● ఓదెల-2 : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● కోర్ట్ : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 26, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 26, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)44, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 26, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

అనారోగ్యంతో విదేశీ విద్యార్థి మృతి

మద్దిలపాలెం , ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చదువుతున్న విదేశీ విద్యార్థి ఒకరు అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘనా దేశంలోని అకుపెం నగరానికి చెందిన ఇవాన్ ఓటెంగ్ లార్టి (29) ఏయూలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వసతి గృహంలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. బుధవారం ఉదయం నాలుగు గంటల సమయంలో ఇవాన్ ఓటెంగ్ లార్టికి తీవ్ర జ్వరం రావడంతో పాటు వాంతులు అయ్యాయి. వెంటనే స్నేహితులు అపోలో ఆస్పత్రికి తీసుకువెళ్లారు.అక్కడ వైద్యులు కేజీహెచ్‌కు తీసుకు వెళ్లాల్సిందిగా సూచించారు. కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా ఇవాన్ ఓటెంగ్ లార్టిను వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు చెప్పారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి ఘనా దేశంలోని మృతుడి బంధువులకు సమాచారం అందించారు.



ఇవాన్ ఓటెంగ్ లార్టి (ఫైల్‌ఫోటో)

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ పదో సెక్టరు ప్రధాన రహదారిలో షిర్డి సాయి ఫంక్షన్ హాలు ఎదురుగా ఓ మ్యాన్ హోల్ మూత ప్రమాదకరంగా మారింది. సరిగ్గా మూత పడక ఓ పక్క పైకి లేచి ఉంది. దీంతో కాస్త ఆదమరచి వాహనాలను నడిపితేవ వాహనదారులు ప్రమాదంలో పడే పరిస్థితి ఉంది. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులకు దీనివల్ల ఇబ్బంది ఎదురవుతోంది. ఒక్కోసారి వాహనం అదుపుతప్పి పడిపోతున్నారు. ఈ మూత చాలా బరువుగా ఉండడంతో స్థానికులు ప్రయత్నించినా సరి చేయలేకపోయారు. జీవీఎంసీ సిబ్బంది వెంటనే సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం


పూజలు అందుకుంటున్న అభయ దుర్గాదేవి

సీతమ్మధార, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల అభయ దుర్గాదేవి, అభయాంజనేయస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పూలదండలు, వెండి వస్త్రాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం పంచామృతాలతో అభిషేకం, సామూహిక సహస్ర నామకుంకుమార్చన, అక్షయ తృతీయ పురస్కరించుకొని నవదుర్గా శ్రీసూక్త సంపుటిత లక్ష్మీహోమం, ఉప దేవతా హోమాలను జరిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అభయ దుర్గాదేవి ఆలయ కమిటీ, న్యూ ఫ్రెండ్స్ అసోసియేషన్ దుర్గా కమిటీ ప్రతినిధులు పర్యవేక్షణలో పూజ కార్యక్రమంతో పాటు ప్రసాద వితరణ చేశారు.

సహృదయ సాహితీ ఆధ్వర్యంలో
శ్రీశ్రీ జయంతి సభ


మాట్లాడుతున్న డాక్టర్ పేరి రవికుమార్

సీతంపేట, ఏప్రిల్ 30, (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీరంగం శ్రీనివాసరావు 115వ జయంతి సభను నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు శేఖర్‌మంత్రి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వక్తలుగా డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ పేరి రవికుమార్ మాట్లాడుతూ శ్రీశ్రీ రాసిన కవితలను విశ్లేషణాత్మకంగా చదివి వినిపించారు. భారతీ భూషణ రాంభట్ల నృసింహశర్మ మాట్లాడుతూ శ్రీశ్రీ రాసిన హరికథను సుందరంగా వినిపించారు. కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణ మూర్తి, కె.భీమేశ్వరరావు, రధారాణి, సీహెచ్ చినసూర్యనారాయణ, డాక్టర్ కేవీఎస్ మూర్తి తదితరులు శ్రీశ్రీ సంబంధించిన అంశాలను వివరణాత్మకంగా వినిపించారు.

ఫుట్‌పాత్ ఆక్రమించి దుకాణాల ఏర్పాటు

- పాదచారులకు తప్పని కష్టాలు
- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇక్కట్లు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు


ఆర్ అండ్ బీ బస్టాపు వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

మాధవధార, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని రోడ్లు, ఫుట్ పాత్‌లపై దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. జాతీయ రహదారి బస్టాపును ఆనుకొని ఆర్ అండ్ బీ బస్టాపు కట్టడాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారాల పేరుతో రోడ్లను చిందరవందర చేస్తున్నారు. బస్సులు ఆగే చోట ప్రయాణికులు నిల్చోడానికి చోటు లేకుండా ఇష్టారీతిన వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జంక్షన్‌లో ప్రధానంగా ఆర్ అండ్ బీ భవనాన్ని ఆనుకొని బడ్డీలు దర్శనమిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రోడ్డెక్కుత్తున మెకానిక్ చాలా దుకాణాలతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ విభాగం పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండటంతో దుకాణదారులు నేరుగా జాతీయ రహదారి సర్వీసు లైను మలుపులో తిష్ట వేసి రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారు. బస్సులు దిగే చోట, సర్వీసు లైను జాతీయ రహదారిపై దూసుకొచ్చే ఆటో వాలాలు ఓ వైపు. దారంతా మెకానిక్ మరమ్మతుల వాహనాలు మరోవైపు ప్రయాణికులకు దడ పుట్టిస్తున్నాయి.

నగరంలో జీ-20 సదస్సు జరిగిన సమయంలో ఈ రోడ్డులో ఆర్టీఏ కార్యాలయం దిగువ రోడ్డు నుంచి ఉన్న దాదాపు 20 దుకాణాలను తొలగించినా, తిరిగి ఈ వ్యాపారాలు యధావిధిగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీనికి మళ్లీ లక్షలాది వ్యయంతో ఫుట్‌పాత్ నవీకరణ, మొక్కల పెంపకం, రోడ్డు ఫుట్‌పాత్‌లకు రంగుల అలంకరణ, ఇనుప ఫెన్సింగ్ పనుల పేరిట జీవీఎంసీ ప్రజాధనం వెచ్చించి పనులు చేపట్టింది.

జాతీయ రహదారి ఫుట్‌పాత్‌లను దుకాణదారులు ఆక్రమిస్తుండడంతో ఈ వ్యయమంతా బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోందని స్థానికులు అంటున్నారు. దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి పాదచారులు, రోడ్డులో వాహనదారుల రాకపోకలకు సరైన వీలు కల్పించాలని కోరుతున్నారు.

'నవ జీవన వైతాళికులు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కెఎస్ చలం, పాల్గొన్న చందు సుబ్బారావు తదితరులు

సీతంపేట, ఏప్రిల్ 30, (ఆంధ్రజ్యోతి) : ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో శాంతి వసంతాలు రచయిత్రి రాజమ్ కృష్ణన్ రాసిన 'నవ జీవన వైతాళికులు' పుస్తకావిష్కరణ నిర్వహించారు. అరసం ప్రతినిధి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కేఎస్ చలం ముఖ్యఅతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకంలో ఉన్న మహిళలు ఆర్థిక సమానత్వ పంథా గురించి వివరించారు. ప్రముఖ విమర్శకులు ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడుతూ కవితా శైలిని విశ్లేషించారు. డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ పుస్తక సమీక్ష చేస్తూ ఇది మంచి పుస్తకమన్నారు. మరో సమీక్షకురాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సుధ మాట్లాడుతూ రాజమ్ కృష్ణన్ రష్యాలో విహరించి తమ ఆలోచనలను పొందు పరిచారన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు పోలిశెట్టి రామకృష్ణ, ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు, అడపా రామకృష్ణ, బండి సత్యనారాయణ, మేడా మస్తాన్ రెడ్డి, సీహెచ్ చినసూర్యనారాయణ, రాధారాణి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలీసెట్

- జిల్లాలో 93.74 శాతం హాజరు


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకుడు విజయభాస్కర్, ఇతర అధికారులు

కంచరపాలెం ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం జరిగిన పాలీసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా పాలీసెట్ కో-ఆర్డినేటర్ డా.కె.నారాయణరావు వెల్లడించారు. జిల్లాలో మూడు డివిజన్లలో భీమునిపట్నం, పెందుర్తి, విశాఖపట్నం నుంచి 13188 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 12363 మంది ప్రవేశ పరీక్షనకు హాజరయ్యారు. పరీక్షకు 825 మంది గైర్హాజరయ్యారు. డివిజన్ల వారీగా చూస్తే.. విశాఖపట్నం డివిజన్‌లో 9405 మందికి 8746 మంది విద్యార్థులు హాజరయ్యారు. పెందుర్తి డివిజన్‌లో 2635 మందికి 2531 మంది, భీమునిపట్నం డివిజన్‌లో 1148 మందికి 1086 మంది విద్యార్థులు హాజరైనట్టు నారాయణరావు తెలిపారు. మొత్తంగా జిల్లాలో 93.74 శాతం పాలీసెట్-2025కు హాజరు శాతం నమోదైంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో జరిగిన పరీక్షకేంద్రాన్ని జిల్లా పాలీసెట్ పరిశీలకులు విజయభాస్కర్ పరిశీలించారు.

ఏప్రిల్‌లో రూ.168 కోట్లు ఆస్తిపన్ను వసూలు

- గత ఏడాదితో పోల్చితే రూ.36 కోట్లు అధికం

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీకి ఆస్తిపన్ను పన్నురూపంలో ఏప్రిల్ నెలలో రూ.168 కోట్లు ఆదాయం సమకూరింది. గత ఏడాది ఏప్రిల్ నెలతో పోల్చితే రూ.36 కోట్లు అధికం కావడం విశేషం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నుని ఒకేసారి చెల్లించినవారికి రాష్ట్రప్రభుత్వం ఐదు శాతం రాయితీ ప్రకటించింది. అలాగే ఇంతవరకూ ఆస్తిపన్ను బకాయి ఉన్నవారికి బకాయిలను చెల్లించేస్తే వడ్డీపై 50శాతం మాఫీని ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. దీనివల్ల ఆస్తి పన్ను వసూలు పెరుగుదలకు దోహదపడిందని జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ)ఎస్. శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. జీవీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సూచనలు మేరకు ఆస్తిపన్ను ఆదాయం మరింత పెంచేందుకు వీలుగా వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించినట్టు వివరించారు.

వాల్తేరు రైల్వే స్పోర్ట్సు మేళా..
ఓవరాల్ చాంపియన్ ఎలక్ట్రికల్ (ఓపీ)



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఎలక్ట్రికల్ (ఓపీ) జట్టు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : తూర్పు కోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహించిన వార్షిక స్పోర్ట్సుమేళా బుధవారం ఘనంగా ముగిసింది. స్పోర్ట్సు మేళాలో భాగంగా 22 రోజులపాటు జరిగిన డివిజన్ అంతర్ విభాగాల క్రీడా పోటీల్లో ఎలక్ట్రికల్ (ఓపీ) 52 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, 33 పాయింట్లలో రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) ద్వితీయ స్థానంలో, 30 పాయింట్లతో ఇంజనీరింగ్ మూడో స్థానంలో నిలిచాయి. కమర్షియల్ విభాగం 26 పాయింట్లతో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నది. శ్రీనివాస కల్యాణ మండపంలో జరిగిన స్పోర్ట్సు మేళా ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న స్పోర్ట్సు మేళాలో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు ప్రాతినిధ్యం వహించడం ద్వారా వారి మధ్య ఐక్యతాభావం ఏర్పడి విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించుకుంటూ సంస్థను ముందుకు నడిపిస్తారని పేర్కొన్నారు. ఈ ఏడాది స్పోర్ట్సు మేళాలో అత్యధికంగా మహిళా ఉద్యోగులు పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్, ఇ.శాంతారామ్, స్పోర్ట్సు ఆఫీసర్ హరినాథ్, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ ఎ.అవినాశ్ శర్మ, సీనియర్ డీపీవో కబీర్ అన్సారీ, సహాయ క్రీడాధికారులు సాహు, పాటిల్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష, కార్మిక సంఘాల నాయకులు మౌళి, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ద్వితీయ స్థానంలో నిలిచిన రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్)

అంబులెన్స్‌ల సైరన్లతో హోరెత్తిన సింహగిరి

... 5వ పేజీ తరువాయి

అధికారులు వెంటనే అంబులెన్స్‌లను రప్పించారు. శిథిలాల కింద ఎక్కువ మంది ఉన్నారని గుర్తించడంతో కొండ దిగువ నుంచి మరికొన్ని అంబులెన్స్‌లు తెప్పించారు. మొత్తం 14 అంబులెన్స్‌లను మృతదేహాలను, గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించడానికి ఉపయోగించారు. ట్రాఫిక్‌లో వీటికి లైన్ క్లియర్ చేయడానికి కొండ దిగువన కొద్దిసేపు బస్సులను నిలిపివేశారు. వీవీఐపీ వాహనాలు తప్ప ఇంకేమీ రాకుండా పోలీసు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ బాధితుల తరలింపును దగ్గరుండి పర్యవేక్షించారు.

కమనీయం... అప్పన్న నిజరూపం

... 5వ పేజీ తరువాయి

ముద్దలను ఉంచారు. షోడశోపచార పూజలు చేసిన తరువాత ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పించారు. తెల్లవారుజామున 2.45 గంటల నుంచి సాధారణ భక్తులను దర్శనానికి అనుమతించారు.

తరలివచ్చిన భక్తులు

స్వామిని నిజరూపంలో దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో అర్ధరాత్రి నుంచే క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ప్రముఖులకు ఉదయం ఆరు గంటల వరకు మాత్రమే అంతరాలయ దర్శనాలు కల్పించిన అధికారులు అనంతరం నీలాద్రిగుమ్మం వద్ద గేటుకు తాళాలు వేశారు. ఇదిలావుండగా తెల్లవారుజామున జోడుభద్రాల వద్ద రూ.300 క్యూ సమీపంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందడంతో సర్వత్రా ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో భక్తుల రాక తగ్గింది. ఆ తరువాత క్రమేపీ రద్దీ పెరుగుతూ ఉదయం పదిన్నర గంటల సమయానికి నిర్దేశించిన క్యూలను దాటి సుమారు 1.5 కిలోమీటర్ల పొడవున ఘాట్‌రోడ్డుపైకి చేరింది. తెల్లవారుజామున భారీవర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో మరింతమంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆ తరువాత వర్షం కురిసినప్పటికీ భక్తుల తాకిడి తగ్గలేదు. పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు సింహాద్రినాథుని నిజరూప దర్శనం చేసుకున్నారు.

సంప్రదాయబద్ధంగా సహస్ర ఘటాభిషేకం

ఆలయ ఆచారం ప్రకారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయరు స్వామి పర్యవేక్షణలోసుమారు నాలుగు వందల మంది శ్రీవైష్ణవులు అంతరాలయంలో స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆ తరువాత తొలివిడత చందన సమర్పణ గావించి, శీతలోపచారాలు సమర్పించి కర్పూర నీరాజనాలిచ్చారు. అప్పన్నను నిత్యరూపంలోకి తీసుకురావడంతోచందనోత్సవం పరిసమాప్తమయింది.

అడుగడుగునా సమన్వయలోపం

... 5వ పేజీ తరువాయి

తగ్గించేశారు. కిందనే ఆపేశారు. అయితే ఆ ఘటనతో సంబంధం లేకుండా భక్తులు, వీఐపీలు దర్శనాల కోసం వస్తూనే ఉన్నారు. భక్తులు వేల సంఖ్యలో వస్తుంటే బస్సులు ఒకటి, రెండు రావడంతో తోపులాటలు జరిగాయి. వీవీఐపీలు కొండ దిగువనే ఏసీ బస్సుల కోసం వేచి చూసి చూసి పైకి వెళ్లే అవకాశం లేకపోవడంతో చాలామంది దర్శనం చేసుకోకుండానే వెనక్కి తిరిగి వెళ్లిపోయారు. ప్రైవేటు వాహనాలు అనుమతించక, ప్రత్యేక వాహనాలు లేకపోతే ఎలా ఉంటూ భక్తులుశాపనార్థాలు పెట్టారు.

క్యూలైన్ల వద్ద కనిపించని స్కానింగ్

ప్రతిసారి క్యూలైన్ల వద్ద తోపులాటలు జరుగుతాయి. అక్కడే జెరాక్స్ కాపీ టిక్కెట్లు తెచ్చి క్యూలైన్‌లో దూరే ప్రయత్నం చేస్తారు. పోలీసులు టిక్కెట్లు లేని తమవారిని అక్కడే లోపలకు పంపిస్తారు. గత ఏడాది ప్రతి ఒక్కరి టిక్కెట్ తీసుకొని స్కానింగ్ చేసి, ఆ తరువాత మరో గేటు వద్ద దానిని పరిశీలించి పంపించారు. ఈసారీ అలాగే చేస్తామని ప్రకటించారు. కానీ ఆచరించలేదు. ఆలయ గోపురం ముందు ఏర్పాటుచేసిన రూ.వేయి, రూ.1,500 క్యూలైన్ల వద్ద తోపులాటలు జరిగాయి. వీటిని పరిమిత సంఖ్యలో ఇచ్చామని అధికారులు చెప్పగా, వందల సంఖ్యలో ఒకేసారి వచ్చి మీద పడిపోయారు. అక్కడే పోలీసు ఉన్నతాధికారులు ఉన్నా పెద్దగా పట్టనట్టు ఊరుకున్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పరిస్థితిని గమనించి, అక్కడికి వెళ్లి దేవదాయ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. అక్కడే ఉండి ఒకరి తరువాత మరొకరు రావాలని సూచించారు. అయినా పరిస్థితి అదుపులోకి రాలేదు. క్యూలైన్లను సరిగ్గా నడపాల్సిన పోలీసులు ఆ విధులు వదిలి ఇంకెక్కడో ఉండడంతో పర్యవేక్షించే దిక్కు లేకుండా పోయింది. దీనివల్ల టిక్కెట్లను స్కానింగ్ చేయలేదు. అది రూ.300 టిక్కెటా? వేయి రూపాయల టిక్కెటా? అని చూడకుండానే చింపేసి లోపలకు వదిలేశారు. ఇక్కడి నుంచే ఎక్కువ మంది అనధికారికంగా లోపలకు వెళ్లారు. ఒకసారి క్యూలైన్‌లోకి వెళితే ఆ తరువాత మళ్లీ చెక్ చేసే ఏర్పాట్లు చేయకపోవడంతో చాలామంది నేరుగా లోపలకు వెళ్లిపోయారు.

బస్సుల వెంట సీపీ పరుగులు

కొండపైన బస్టాండులో వేలాది జనం, ఒకటి అరా బస్సులు వస్తుండడంతో సీట్ల కోసం భక్తులు పరుగులు పెట్టారు. వేలాడుతూ కిందికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఆ పరిస్థితిని గమనించిన పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వారిని నివారించే ప్రయత్నం చేశారు. బస్సులు వస్తాయని, కాసేపు ఆగి వెళ్లాలని, బస్సుల వెంట పరుగులు తీయొద్దని సూచించారు. ఫుట్‌రెస్ట్‌పై వేలాడుతున్న వారిని కిందికి దించే ప్రయత్నం చేశారు. కళ్ల ముందు వైఫల్యం కనపడుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు.

వైసీపీలోనే నీచ సంస్కృతి

- తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నీచ సంస్కృతి, నీచ భాష టీడీపీలో లేదని, అదంతా వైసీపీ విష సంస్కృతి అని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దక్షిణ నియోజకవర్గంపై తెలుగుశక్తి దండయాత్రకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను డామినేట్ చేసేందుకు సీతంరాజు సుధాకర్ ప్రయ్నతిస్తున్నారని ఆరోపించారు. కనీసం దరఖాస్తులను కూడా ఎమ్మెల్యేకు చేరనీయడం లేదన్నారు. ఈ విషయమై పార్టీ పెద్దలు దృష్టిసారించాలని కోరారు.


ప్రదర్శన తిలకిస్తున్న రాజఫణి పప్పు, డాక్టర్ వి.చంద్రశేఖరమ్, శ్రీప్రకాశ్ డైరెక్టర్ వాసుప్రకాశ్

'శ్రీప్రకాష్'లో వేసవి శిక్షణ శిబిరం

సీతమ్మధార, ఏప్రిల్ 30, (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించేలా శ్రీప్రకాశ్ విద్యానికేతన్‌లో వివిధ అంశాల్లో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. రోబోటిక్ 3డి ఆర్ట్, ఒరిగామి వంటి వాటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. గ్లు ఆర్ట్ పెయింటింగ్, మురాల్ క్లే ఆర్ట్‌లతో మంచి చిత్రాలు వేశారు. పలు రకాల రోబోట్‌లను తయారు చేసి ప్రదర్శించారు. 3డి ఆబ్జెక్ట్, 3డి పెయింటర్స్ ఉపయోగించి వివిధ రకాలైనటువంటి ఆకృతులను తయారు చేసి ప్రదర్శించారు. వాటితో పాటుగా పలు రకాల ఒరిగామి, కాగితపు బొమ్మలు చేశారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా వీటిని ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ రాజఫణి పప్పు, డాక్టర్ వి.చంద్రశేఖరమ్ హాజరై విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విద్యార్థులు యోగా, డ్యాన్సలతో చక్కటి ప్రదర్శనలు ఇచ్చారు. పాఠశాల డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాశ్ విద్యార్థులకు అభినందించారు.

4న 'వినోదాల విందు' కామెడీ షో

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పౌర గ్రంథాలయంలో ఈనెల 4వ తేదీన ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ విశాఖపట్నం, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో వినోదాల విందు కామెడీ షో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6.30 నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈమేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలు

జ్ఞానాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జోన్-5లో రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలైంది. జోన్ పరిధిలో అసెస్‌మెంట్లు ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 81. 57 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ. 27.19 కోట్లు వసూలైనట్టు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు, ఆర్‌ఓ రాజ్యలక్ష్మీ కృషి వల్ల ఇది సాధ్యపడిందన్నారు

టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ

మహారాణిపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 35వ వార్డు పూర్ణా మార్కెట్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను బుధవారం పంపిణీ చేశారు. నియోజకవర్గం ఇన్ చార్జి సీతంరాజు సుధాకర్ కార్యకర్తలకు కార్డులు అందజేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు బుచ్చా రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భాస్కరరావు, వార్డు తెలుగు యువత అధ్యక్షుడు బుచ్చా శ్రీను, బాలాజీ, చిన్న, రెహ మాన్ పాల్గొన్నారు.

'హిందీపై పట్టు ఉండాలి'

జ్ఞానాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ జోసెఫ్ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో ప్రచురిస్తున్న హిందీ పత్రిక ప్రతిభ మ్యాగజిన్ 18వ సంచికను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లుగా పత్రికను నడుపుతున్నామని, దీని వల్ల విద్యార్థుల్లో భాషా నైపుణ్యంతో పాటు సాహిత్యంపై పట్టు వస్తుందన్నారు.

భారతీయ నృత్యానికి విశ్వ వ్యాప్త ఆదరణ

మహారాణిపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : భారతీయ నృత్యానికి విశ్వవ్యాప్త ఆదరణ ఉందని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు పైడి రజని అన్నారు. బుధవారం ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాళీమాత మందిరంలో శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్యం అన్ని వర్గాల ఆదరణ పొందుతుందన్నారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వై. సోమలత మాట్లాడుతూ నేటి యువత ఆధునిక డ్యాన్సుల వైపు మొగ్గు చూపు తున్నా.. చిరకాలం నిలిచేది శాస్త్రీయ నృత్యమేనన్నారు. శాస్త్రీయ్య నృత్యంపై ఉన్న కోర్సులు కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. అనంతరం బాలికలు, మహిళలు చేసిన నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించాయి.


నృత్య పోటీల్లో పాల్గొన్న కళాకారులు

గ్రీన్ సిటీ శ్రీవారి ఆలయంలో అక్షయ తృతీయ పూజలు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్ సిటీ శ్రీవారి ఆలయంలో అక్షయ తృతీయను పురస్కరించుకుని స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, అర్చన, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా ముస్తాబు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. పూజాది కార్యక్రమాల్లో వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్ కుమార్, పద్మజ, వీవీ కృష్ణారావు, రాజ్యలక్ష్మి,శాంతి, మోహిత్,శ్రీను,సునీల్,గణేశ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

పెందుర్తి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సరిపల్లి, గుర్రంపాలెం, 94వ వార్డులోని పలు ప్రాంతాల్లో బుధవారం కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సరిపల్లిలో సర్పంచ్ గొర్లె రామకృష్ణ, గుర్రంపాలెంలో ఎంపీటీసీ గండ్రెడ్డి మాలతి, 94వ వార్డులో జనసేన వార్డు అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చాక మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ అందజేయడం జరుగుతుందని ఏపీడీ చిరంజీవి తెలిపారు.

నేటి బాలలే రేపటి పౌరులు

మల్కాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులు, నాయకులని కోరమాండల్ ఎరువుల కర్మాగారం సీఎస్సార్ డిప్యూటీ మేనేజర్ శేషపు వెంకటరమణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. బాలలపై చేసే ఖర్చు దేశాభివృద్ధికి పెట్టే పెట్టుబడిగా పేర్కొన్నారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులందరూ ఎంతో క్రమశిక్షణతో శిబిరంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జాతీయ సేవా పథకం వలంటీర్ జ్యోతిర్మయి వ్యాయామం, యోగాపై చిన్నారులకు శిక్షణ ఇచ్చారు.

రైలు ప్రయాణికులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రతిరోజూ మధ్యాహ్న సమయంలో రైలు ప్రయాణికులకు ఉచితంగా మినరల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు డీఆర్‌ఎం (కమర్షియల్) నుంచి అనుమతి తీసుకుని బుధవారం నుంచి వాటర్ బాటిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టినట్టు తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ తెలిపారు. జూన్ నెల వరకు ప్రతిరోజూ 500 వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తామన్నారు. లయన్స్ క్లబ్, మానవ వికాస వేదిక, స్పందన చేయూత ఫౌండేషన్, సర్వహిత, మానవత, సత్యసాయి చారిటబుల్ ట్రస్ట్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు జాషువా, జీవీ రావు, రాజేశ్వరరావు, రమామణి, రాజేశ్వరి, సుందరమూర్తి, అహ్మద్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 26, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 14, క్యారెట్ 30 దొండకాయలు 26, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 44, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 26, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 34, కంద 80, గోరుచిక్కుడు 30, దేముడుచిక్కుడు 64, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బూడిద గుమ్మడికాయ 30, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

భారీ వర్షం

- గోపాలపట్నంలో పొంగిపొర్లిన గెడ్డలు.. రోడ్లపై ప్రవహించిన మురుగు నీరు
- దుర్భరంగా మారిన వెంకటాపురం ఐదు మదాల మార్గం
- ఈదురుగాలులకు పెందుర్తిలో నేలకూలిన విద్యుత్ స్తంభాలు



గోపాలపట్నం నాగేంద్రకాలనీ ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

గోపాలపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో సుమారు గంటన్నర పాటు బుధవారం వేకువజామున భారీ వర్షం కురవడంతో కొండవాలు ప్రాంతాల నుంచి కాలువల ద్వారా వచ్చిన మురుగు నీరు, వరద నీటితో గెడ్డలు పొంగి ప్రవహించాయి. ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీటితో పాటు వచ్చిన చెత్తాచెదారం, వ్యర్థాలు కల్వర్టుల వద్ద పేరుకుపోవడంతో కాలువల నుంచి మురుగు నీరు రహదారులపై పారడంతో ఛిద్రంగా మారాయి. ఇక్కడి శ్రీరామ్‌నగర్, కొత్తపాలెం అండర్‌పాస్‌వే, నాగేంద్ర కాలనీ ప్రధాన గెడ్డల వద్ద గల కల్వర్టుల్లో పెద్ద మొత్తంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో జీవీఎంసీ సిబ్బంది కల్వర్టుల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు.

దుర్భరంగా మారిన ఐదు మదాల మార్గం

దశాబ్దాల కాలంగా రైల్వే సమస్యతో రహదారి నిర్మాణానికి నోచుకోక దుర్భరంగా మారిన వెంకటాపురం అండర్ పాస్‌వే నుంచి రాకపోకలు సాగించేందుకు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకటాపురం ఐదు మదాల మార్గం నుంచి కంపరపాలెం, వెంకటాపురం, పద్మనాభనగర్, కొత్తపాలెం గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా వెంకటాపురానికి చెందిన శ్మశానవాటికకు రాకపోకలు సాగించాలంటే ఐదు మదాల మార్గం నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అయితే రైల్వే సమస్య కారణంగా ఐదు మదాల్లో రహదారి నిర్మాణానికి నోచుకోపోవడంతో ఈ మార్గం నుంచి రాకపోకలు సాగించేందుకు స్థానికులు నానాపాట్లు పడుతున్నారు. వర్షాల సమయంలో ఎవరైనా శ్మశానవాటికకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. బుధవారం వేకువజామున కురిసిన భారీ వర్షానికి ఐదు మదాల మార్గమంతా మురుగు నీటితో నిండిపోవడంతో గ్రామంలో మృతి చెందిన ఓ వృద్ధురాలి మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించేందుకు గ్రామస్థుల ఇక్కట్లు వర్ణనాతీతంగా మారింది. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఐదు మదాల్లో రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఐదు మదాల మార్గంలో చేరిన మురుగులో నడుస్తూ శ్మశాన వాటికకు మృతదేహాన్ని తీసుకువెళ్తున్న వెంకటాపురం గ్రామస్థులు

పెందుర్తిలో నేలకూలిన స్తంభాలు: విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

పెందుర్తి: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి విద్యుత్ శాఖకు అపారమైన నష్టం వాటిల్లింది. బుధవారం వేకువజామున ఈదురు గాలుల బీభత్సానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సంబంధిత సిబ్బంది శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షానికి ఈదురుగాలులు తోడవ్వడంతో సరిపల్లి,గొరపల్లి,రాంపురంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాలపై తాటిచెట్లు, ఇతర చెట్లు విరిగిపడడంతో వైర్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లడంతో సిబ్బంది ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

లక్ష్మీనగర్‌లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు పరిధి లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్ కొండవాలు ప్రాంతంలో భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరడంతో పాటు రోడ్డుపైకి చెత్తాచెదారం, వ్యర్థాలు కొట్టుకు వచ్చాయి. ఇక్కడి రేషన్ డిపోలోకి వర్షపు నీరు చేరడంతో అడుగున ఉన్న బస్తాలు నానిపోయాయి. ఆయా ప్రాంతాల్లో కార్పొరేటర్ బొమ్మిడి రమణ పర్యటించి ప్రజలతో మాట్లాడారు. పారిశుధ్య సిబ్బంది చందనోత్సవ పనులకు వెళ్లడంతో పరిసరాలను పరిశుభ్రంగా చేయడంలో ఆలస్యం చోటుచేసుకుంది.



గొరపల్లిలో విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగిపడిన దృశ్యం



లక్ష్మీనగర్ రేషన్ డిపోలో తడిచిపోయిన బియ్యం బస్తాలు

భక్తులతో కిటకిటలాడిన గోశాల కూడలి

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్..

వేపగుంట ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న స్వామిని నిజ రూపంలో దర్శించేందుకు తరలివచ్చిన భక్తులతో గోశాల కూడలి కిటకిటలాడింది. అయితే సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంతో రూ.1,500, రూ.1,000 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు శ్రీనివాసనగర్‌లోని నూతన కల్యాణ మండపంలో బస్సుల కోసం గంటల తరబడి వేచివుండాల్సి వచ్చింది. టైమ్ స్లాట్ మేరకు ఉదయం ఐదు గంటలకే ఇక్కడకు భక్తులు చేరుకున్నప్పటికీ పది గంటల వరకు బస్సుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో పిల్లాపాపలతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక్కడి కల్యాణ మండపం మలుపు తిరిగే ప్రాంతం కావటంతో కాసేపు ట్రాఫిక్ జామ్ అయింది. అలాగే భక్తులు బస్సులు ఎక్కే సమయంలో తోపులాటలు కూడా చోటుచేసుకున్నాయి. కాగా ఎండలో ఉన్న భక్తుల దాహార్తి, ఆకలిని తీర్చేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు చక్రపొంగలి, పులిహోర, దద్దోజనం, చక్రపొంగలి, పుచ్చకాయలు, తాగునీరు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు వంటి వాటిని పంపిణీ చేశాయి. ఆర్టీసీ బస్సుల రాకపోకలను ఇన్‌చార్జి ఆర్‌ఎం బి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. సీటీఎం సత్యనారాయణ ఇక్కడ ఏర్పాట్లను చూశారు. సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ భక్తులను తరలించేందుకు 51 ఉచిత బస్సులను నడిపామన్నారు.



సింహగిరికి చేరేందుకు వేచివున్న రూ.1,500, రూ.1,000 టికెట్లు కొన్న భక్తులు

నగరానికి వైఎస్ జగన్



విమానాశ్రయం వద్ద కార్యకర్తలకు నమస్కారం చేస్తున్న జగన్

గోపాలపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం చందనోత్సవం సందర్భంగా గోడకూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించడానికి మాజీ సీఎం వైఎస్ జగన్ బుధవారం నగరానికి వచ్చారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రం 5 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు వైసీపీ నగర నాయకులు స్వాగతం పలికారు. మృతుల కుటుంబీకులను పరామర్శించిన అనంతరం రాత్రి 7 గంటలకు ప్రత్యేక విమానంలో జగన్ విజయవాడ బయలుదేరి వెళ్లారు.

గోపాలపట్నం పోలీసులపై హోంమంత్రి అనిత సీరియస్

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై గోడ కూలి మృతి చెందిన వారికి పోస్టుమార్టం నిర్వహించే ప్రక్రియను వేగంగా ప్రారంభించకపోవడం పట్ల హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పోసుమార్టం ప్రక్రియను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ గోపాలపట్నం పోలీసులపై ఆగ్రహం వెలిబుచ్చారు. మీ అందరి సంగతి తేలుస్తానంటూ హెచ్చరించారు. వేగంగా ప్రక్రియ పూర్తి చేయకుండా ఏం చేశారంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

యారాడ ఘాట్ రోడ్డులో రిటెయినింగ్ వాల్‌ను ఢీకొన్న ఆటో

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

సింధియా, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యారాడ ఘాట్ రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం ఇక్కడి జైయాంధ్ర కాలనీలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో బుధవారం వారంతా యారాడ సముద్ర తీరానికి వెళ్లి తిరిగి ఆటోలో జైయాంధ్ర కాలనీకి బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో ఆటో అదుపు తప్పి యారాడ రోడ్డులోని రిటెయినింగ్ వాల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు అందులో ఉన్న ఆరుగురు చిన్నారులు, తదితరులకు ఏమీ కాలేదు. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుండగా ఇదే మార్గంలో వస్తున్న ద్విచక్ర వాహనం స్కిడ్ అవ్వడంతో భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి.



రిటెయినింగ్ వాల్‌ను ఢీకొన్న ఆటో

కాంగ్రెస్ పార్టీ కొవ్వొత్తుల ర్యాలీ

పెదగంట్యాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కశ్మీరులోని పహల్గాం వద్ద ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నడుపూరు రాజీవ్ గాంధీ కూడలిలో ఏపీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి పర్యాటకులను దారుణంగా హతమార్చడాన్ని ఆటవిక చర్యగా పేర్కొన్నారు. ఉగ్రవాదులను తరిమికొట్టాలని కోరారు. నాయకులు ఎంఎస్ వర్మ, భూలోక రాజు, కె.పెంటయ్య, ఆనంద్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విదేశీ విద్యార్థి మృతి

మద్దిలపాలెం (విశాఖపట్నం), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చదువుతున్న విదేశీ విద్యార్థి ఒకరు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘనా దేశంలోని అకుపెం నగరానికి చెందిన ఇవాన్ ఓటెంగ్ లార్బి (29) ఏయూలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వసతి గృహంలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. బుధవారం ఉదయం నాలుగు గంటల సమయంలో ఇవాన్ ఓటెంగ్ లార్బికి తీవ్ర జ్వరం రావడంతో పాటు వాంతులు అయ్యాయి. వెంటనే స్నేహితులు అపోలో ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు కేజీహెచ్‌కు తీసుకువెళ్లాల్సిందిగా సూచించారు. కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా ఇవాన్ ఓటెంగ్ లార్బిను వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు చెప్పారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి ఘనా దేశంలోని మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

ఉరుములు, ఈదురు గాలులతో వర్షం

ఉక్కపోత నుంచి ఉపశమనం పొందిన నగరవాసులు

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా ఎండ, ఉక్కపోతతో అల్లాడిన నగరవాసులు బుధవారం వేకువజాము నుంచి కురిసిన వర్షంతో సేదదీరారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక నగరంపై మేఘాలు ఆవరించి ఉరుములు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి నగరం, పరిసరాల్లో మేఘాలు దట్టంగా ఆవరించాయి. ఉదయం నుంచి కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి.

మధ్యాహ్నం నుంచి నగరం, పరిసరాల్లో జోరున వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. సాయంత్రం వరకు మేఘాలు కొనసాగాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు భీమిలిలో 24.75, బుచ్చిరాజుపాలెంలో 24.25, సింహాచలంలో 21.5, గాజువాక కేబీఆర్ పార్కులో 20.25 మి.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు గాజువాక కేబీఆర్ పార్కు వద్ద 32.0, మేహాద్రిగెడ్డ వద్ద 30.5, అగనంపూడిలో 29.25, దువ్వాడలో 25.75, షీలానగర్‌లో 22.5 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

'ఉక్కు' కాంట్రాక్టు కార్మికుల సేవలు విశేషమైనవి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సేవలు విశేషమైనవని కోక్-ఓవెన్ విభాగాధిపతి దుర్గాప్రసాద్ అన్నారు. విభాగంలోని 380 పుషింగ్స్ చేయడంలో కీలక పాత్ర పోషించిన కాంట్రాక్టు కార్మికులను బుధవారం ఆయన విభాగంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాటరీలో ఉత్పత్తి తీసేందుకు కాంట్రాక్టు కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ప్లాంటుకు కీలకమైన ఈ విభాగంలో ఉత్పత్తి పెంచేందుకు విశేష కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఈ నెలలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో జీఎం (ఆపరేషన్స్) వైవీఆర్ శ్రీనివాస్, డీజీఎంలు బి.వెంకటేశ్వరరావు, రాజగోపాల్ నాయుడు, అధికారులు శ్రీనివాసరావు, తివారీ, మునినాడ శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమమే టీఎన్‌టీయూసీ ధ్యేయం'

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా టీఎన్‌టీయూసీ ముందుకు సాగుతుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. టౌన్‌షిప్‌లో బుధవారం కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి కార్మికులే వెన్నుముఖ అని అన్నారు. మే డే స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. విజయవాడలో గురువారం జరగనున్న మే డే కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనవలసిందిగా కోరారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి దీప్తి, కొల్లి శివనాగేశ్వరరావు, ఎ.మణి, చింతయ్య, సత్యనారాయణ, నాగేంద్రమ్మ, ప్రసాద్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు క్లాత్ సంచుల పంపిణీ

అగనంపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు కోరారు. బుధవారం ఆయన తన సొంత నిధులతో తయారుచేయించిన నార సంచులను స్థానికులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడానికి అందరూ నార సంచులను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గుదే సుశీల గజేంద్రరరావు, మస్తాన్‌రెడ్డి, ఎం.ఉమామహేశ్వరరావు, వసంతరావు, రమేశ్, పాపారావు, సోమేశ్వరరావు, పద్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

జంట హత్యల కేసు కొలిక్కి!

ఆ దంపతులతో సన్నిహితంగా ఉంటున్న వ్యక్తే హంతకుడు?

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి రాజీవ్ నగర్‌లో జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసు ఒక కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. హత్యకు గురైన గంపల యోగీంద్రబాబు (66), లక్ష్మి (52)లతో బాగా సన్నిహితంగా ఉండే వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు సమాచారం. మిస్టరీగా మారిన ఈ కేసును ఎట్టకేలకు పోలీసులు చేధించినట్టు తెలియవచ్చింది. రిటైర్డు నేవల్ ఉద్యోగి అయిన యోగీంద్రబాబుకు, స్థానిక గ్లోరియో స్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న లక్ష్మికి ఎవరితో విభేదాలు లేవని స్థానికులతో పాటు కుటుంబ సభ్యులు పేర్కొన సంగతి తెలిసిందే.

అయితే ఈ దంపతులకు బాగా సుపరిచితుడైన వ్యక్తే హత్యలకు పాల్పడినట్టు తెలుస్తోంది. హతుల ఇంట్లో బంగారం, నగదు మాయం కాకపోవడంతో ఇది దొంగల కాదని, ఆ కుటుంబంతో అత్యంత సన్నిహితంగా ఉండేవారే దారుణానికి పాల్పడి ఉంటారన్న కోణంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేసినట్టు తెలిసింది. సీపీ ఆదేశాల మేరకు పోలీసులు వందలాది మందిని విచారించి హంతకుడి ఆచూకీ కనుగొన్నట్టు తెలియవచ్చింది. జంట హత్యలకు పాల్పడిన వ్యక్తి యోగీంద్రబాబు దంపతులకు చెందిన స్కూటీపై విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడ ఆ వాహనాన్ని పార్కింగ్ చేసి వేరే రాష్ట్రానికి పారిపోయినట్టు సమాచారం. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లో స్కూటీని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. హంతకుడి కోసం పోలీసులు పలు రాష్ట్రాల్లో గాలిస్తున్నట్టు భోగట్టా!

భెల్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.24 లక్షల వసూలు

బాధితుడి ఫిర్యాదు మేరకు యువకుడి అరెస్టు

పెందుర్తి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (భెల్)లో ఇంజనీర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ యువకుడిని మోసం రూ.24 లక్షలు వసూలు చేసి ఆ డబ్బును క్రికెట్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్న ప్రబుద్ధుడిని బుధవారం పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పురుషోత్తపురానికి చెందిన జి.రవితేజ (28) బీటెక్ తప్పి ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో పెందుర్తి బీసీ కాలనీలో ఉంటున్న సాగర్‌తో పరిచయమైంది. బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ యత్నాలు చేస్తున్న సాగర్‌కు భెల్‌లో ఉద్యోగం వచ్చేలా చూస్తానని నమ్మబలికి దఫదఫాలుగా రూ.24 లక్షలను రవితేజ వసూలు చేశాడు. అలా వసూలు చేసిన డబ్బుతో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు రవితేజ పాల్పడి మొత్తం పోగొట్టుకున్నాడు. తన ఉద్యోగం గురించి సాగర్ ఎన్నిసార్లు అడిగినా రవితేజ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ తప్పించుకుని తిరుగుతుండడంతో తాను మోసపోయానని భావించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రవితేజను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ నుంచి డాక్‌యార్డుకు వెళ్లే రోడ్డులో టోల్ గేటు సమీపంలో డివైడర్ పక్కన బుధవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్లలోపు ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా మృతుడి గురించి తెలిస్తే 9440796014, 9642364770 సెల్ నంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

అంతులేని వేదన



వెంకటరావు బంధువుల విలాపం

- మృతుల కుటుంబసభ్యుల రోదనతో కేజీహెచ్ వద్ద తీవ్ర విషాదం
- బాధిత కుటుంబాలను పరామర్శించిన రాజకీయ నాయకులు

బంధువుల ఆర్తనాదాలు, స్నేహితులు, కుటుంబసభ్యుల రోదనతో కేజీహెచ్‌లో విషాద వాతావరణం నెలకొంది. సింహగిరిపై జరిగిన ఘటనలో మృతదేహాలను ఇక్కడి మార్చురీకి తరలించారు. హోంమంత్రి అనిత, కూటమి ఎమ్మెల్యేలు, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు చేరుకుని బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతదేహాలకు సత్వరం పోస్టుమార్టం ప్రక్రియను పూర్తిచేయించి, స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

\- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



సింహగిరిపై గోడ కూలిన ప్రదేశంలో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత



మహేశ్ తల్లిని ఓదారుస్తున్న హోం మంత్రి అనిత



సింహగిరిపై క్యూలైన్ వద్ద కూలిన గోడ





మృతదేహాలను వెలికితీసి, తరలిస్తున్న సహాయక సిబ్బంది



రోదిస్తున్న వెంకటరత్నం బంధువు మహాలక్ష్మి



ఘటన వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ శ్రీభరత్



కేజీహెచ్ మార్చురీ వద్ద కూటమి నాయకులు



సింహగిరిపై గోడ నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా



విలపిస్తున్న వెంకటరావు భార్య

యువ దంపతులకు కన్నీటి వీడ్కోలు

మధురవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలో గోడకూలిన ఘటనలో మృతిచెందిన చంద్రంపాలేనికి చెందిన యువ దంపతులు పిళ్ళా మహేష్, శైలజ మృతదేహాలకు బంధువులు, కుటుంబసభ్యులు, స్నేహితులు కన్నీటిధారల నడుమ బుధవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. పెద్దఎత్తున తరలివచ్చి గ్రామస్థులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. యువ దంపతులు, శైలజ కుటుంబసభ్యుల రోదన మిన్నంటింది. నగరంలోని హెచ్‌బీ కాలనీకి చెందిన శైలజ తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జారి మహాలక్ష్మి మృతదేహాలకు అక్కడే అంత్యక్రియలు జరిపారు. ఈ పరిస్థితి ఏ కుటుంబానికీ రాకూడదంటూ పలువురు నిట్టూర్చారు. కాగా మహేష్ కుటుంబసభ్యులను వివిధ పార్టీల నేతలు పరామర్శించి, ఓదార్చారు.

మృతుల కుటుంబాలకు నష్ట పరిహారానికి డిమాండ్

- కేజీహెచ్ వద్ద బాధితులతో చర్చించిన హోం మంత్రి అనిత , ఎమ్మెల్యేలు

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో మృతులకు రూ.కోటి చొప్పున పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని వారి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. పరామరకుపరామర్శించేందుకు వచ్చిన హోం మంత్రి అనితతోపాటు ఎమ్మెల్యేలను నిలదీశారు. న్యాయం చేసే వరకు పోస్టుమార్టం చేయవద్దని నినదించారు. మార్చురీ వద్ద వామపక్ష పార్టీల ప్రతినిధులతో కలిసి నినాదాలు చేశారు. అయి తే తమ చేతుల్లో లేదని కొందరు నేతలు చెప్పగా.. అవసరమైతే సీఎం చంద్రబాబుతో ప్రకటన చేయించాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా మంత్రి అనిత బాధిత కుటుంబసభ్యులతో చర్చించారు. ఎమ్మెల్యేలు వెలగపూడి, ఇతర నాయకులు పలుమార్లు వారితో మంతనాలు జరిపారు. ప్రభుత్వం సాయం అందించడంతో పాటు పిల్లలను చదివిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అయినా వారు పట్టువీడలేదు. దీంతో మళ్లీ చర్చలు జరిపారు. అనంతరం బాధితులకు రూ.25 లక్షల చొప్పున పరిహారంతో పాటు విద్యార్హతలను బట్టి ప్రభుత్వ ఉద్యోగావకాశం కల్పిస్తామని మంత్రి ప్రకటించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు మృతదేహాలను తరలించారు. ఈ సమయంలో ఉమా



మృతదేహాల తరలింపును పర్యవేక్షిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మహేష్ తండ్రి అప్పలనాయుడు ఇక్కడి నుంచి వెళ్లిపోతే న్యాయం జరగదని ఆవేదన వ్యక్తం చేయడంతో మంత్రి అనిత సర్ది చెప్పారు.

ఏటా ఏదో ఒక గందరగోళం!

- అస్తవ్యస్తంగా చందనోత్సవం నిర్వహణ
- గతంలో క్యూలైన్లలో తోపులాట, ట్రాఫిక్ జామ్
- ఇప్పుడు ఏకంగా నిండు ప్రాణాలు బలి
- ముందస్తు ఏర్పాట్లలో పూర్తి వైఫల్యం
- ఘటన తర్వాత సంప్రోక్షణ చేయకుండానే.. భక్తులకు దర్శనాలపై తీవ్ర విమర్శలు

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో జరుగుతున్న వరుస సంఘటనలు భక్తులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వైకుంఠ ఏకాదశి టికెట్ల క్యూలైన్లలో జరిగిన తొక్కిసలాటలో తిరుపతిలో ఆరుగురు మరణించిన ఘటన మరువక ముందే సింహాచలం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గోడ కూలి పలువురు భక్తులు మృతిచెందారు. సింహాచలం దేవస్థానంలో ఏటా చందనోత్సవం నిర్వహిస్తున్నారు. భక్తులు లక్షల్లో వస్తారని అధికారులకు అంచనా ఉంది. దానికి తగినట్టు పకడ్బందీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కానీ చందనోత్సవం సమయంలో దేవదాయ శాఖ అధికారులు ఎప్పుడూ విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్లుగా ఈ సమయంలో సింహగిరిపై ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది. 2022, 2023లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ రెండేళ్లు సాధారణ భక్తులు స్వామివారి దర్శనం కోసం తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. 2023లో ఐదు గంటలపాటు కొండపై ట్రాఫిక్ నిలిచిపోయింది. దేవదాయ శాఖ, స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య సమన్వయ లోపం కూడా భక్తులకు నరకం చూపిస్తోంది. వీరందరి నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా ఈసారి పెను విషాదం చోటుచేసుకుంది. నిజానికి, చందనోత్సవానికి ముందు కలెక్టర్, ఎస్పీ, దేవదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు రెండు, మూడుసార్లు సమీక్షలు నిర్వహించారు. అక్కడ ఏం సమీక్షించారో తెలియదుగానీ, గత రెండు, మూడేళ్ల అనుభవాలను బట్టిచూస్తే ముందస్తు ప్రణాళిక రచనలో విఫలమయ్యారని తెలుస్తోంది. దాదాపు పది, పదిహేను రోజుల నుంచి చందనోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ గోడ కట్టి కేవలం నాలుగు రోజులు మాత్రమే అయింది. గోడ నిర్మాణం చేపట్టక ముందు నుంచే ఆ ప్రాంతం నుంచి రూ.300 క్యూలైన్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అలాంటప్పుడు అంత భారీ గోడ నిర్మాణం ఎందుకు చేపట్టారని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. కాగా, చందనోత్సవం రోజున ఆలయ ప్రాంగణంలో భక్తుల మృతి తర్వాత ఆలయాన్ని సంప్రోక్షన చేయాలి. కానీ, అధికారులు భక్తులను దర్శనాలకు అనుమతించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సంప్రోక్షన చేయకుండా దర్శనాలకు ఎలా అనుమతిస్తారంటూ ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: ఎంపీ శ్రీభరత్

సింహాచలంలో దుర్ఘటనపై ఎంపీ శ్రీభరత్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనకు కారణాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించిందని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్నారు.

ఘటన బాధాకరం: మేయర్ పీలా

సింహగిరిపై జరిగిన ఘటన బాధాకరమని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. కేజీహెచ్‌లో సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావుతో కలిసి మృతులకు నివాళులర్పించి, కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. ప్రభుత్వంపై విమర్శలకు ఇది సమయంకాదని హితవు పలికారు. మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.



చంద్రంపాలెంలో యువ దంపతుల మృతదేహాలకు నివాళులర్పించి, వారి బంధువులను ఓదారుస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలి

- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం అండగా నిలవాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. కేజీహెచ్‌లోని మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాసిరకం పనులతోనే ఘటన జరిగిందన్నారు. దీనిని రాజకీయం చేయాల్సిన అవసరం తమకు లేదని, తప్పునకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయ్‌కుమార్, తదితరులున్నారు.



మృతి చెందిన బంధువులను పరామర్శించేందుకు కేజీహెచ్‌కు వస్తున్న వైసీపీ నాయకులు అమర్‌నాథ్, కేకే రాజు, చిన్న శ్రీను తదితరులు

సింహగిరికి పోటెత్తిన భక్తులు

- అంగరంగ వైభవంగా చందనోత్సవం
- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం



స్వామి దర్శనానికి ఘాట్ రోడ్డుపైకి చేరిన భక్తుల క్యూ



భక్తులతో కిక్కిరిసిన సింహగిరి



చందనోత్సవంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబసభ్యులు



సింహగిరిపై బస్సుల వద్ద నెలకొన్న రద్దీ



వర్షంలో స్వామి దర్శనానికి వెళ్తున్న రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్



అప్పన్న నిజరూప దర్శనానికి వెల్లువలా తరలవచ్చిన భక్తులు

ఘనంగా సహస్ర ఘటాభిషేకం



కలశాలతో త్రిదండి రామానుజ చినజీయరు స్వామి, శ్రీవైష్ణవులు

సింహాచలం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చందనోత్సవం అనంతరం బుధవారం రాత్రి వరాహలక్ష్మీనృసింహస్వామికి సంప్రదాయబద్ధంగా సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. గంగధారలో పవిత్ర స్నానాలు ఆచరించిన శ్రీవైష్ణవ స్వాములు మట్టి కలశాల్లో గంగధారను నింపుకున్నారు. ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ప్రధాన రజిత కలశంలో జలం సేకరించి ముందుకు నడిచారు. అనంతరం పురుషసూక్తం, శ్రీసూక్తం పఠిస్తూ గర్భాలయం చేరుకోగా జీయర్ స్వామి, అర్చకులు నిజరూపంలోని మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. ముందుగా సిద్ధం చేసిన రజిత కలశాలతో అష్టోత్తర శత (108) పంచామృతాభిషేకం చేశారు.

అప్పన్న చందనోత్సవంలో ప్రముఖులు



అప్పన్న తొలి దర్శనానికి వెళ్తున్న అశోక్ గజపతిరాజు దంపతులు

సింహాచలం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూపాన్ని బుధవారం లక్షలాదిమంది భక్తులతో పాటు రాజకీయ, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు దర్శించుకున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపాతిరాజు కుటుంబం, రెవెన్యూ, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యమూర్తి, హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా వీరాంజనేయస్వామి, కొండపల్లి శ్రీనివాస్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, గణబాబు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, కేఎస్ఎన్ రాజు, సుందరపు విజయకుమార్, దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి వి.వినయ్ చంద్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, సీపీ శంఖభత్ర బగ్చి, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితరులున్నారు.